ప్రజాశక్తి
శనివారం 19 ఏప్రిల్ 2025
8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

నేడే అవిశ్వాసం



ప్రత్యేక సమావేశానికి సిద్ధమైన కౌన్సిల్ హాల్

- జివిఎంసి ప్రత్యేక సమావేశం
- మేయర్ స్థానం కైవసం దిశగా 'కూటమి'
- ప్రత్యేక సమావేశాన్ని బహిష్కరించిన వైసిపి
- పటిష్ట పోలీసు బందోబస్తు
- మీడియాకూ నో ఎంట్రీ
- సర్వత్రా ఉత్కంఠ

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

మరి కొద్ది గంటల్లో మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ (జివిఎంసి) మేయర్ పీఠం కోసం ఎన్నిక జరుగనుంది. 74 మంది కార్పొరేటర్లు చేతులెత్తి నగర ప్రథమ పౌరున్ని/పౌరురాలిని ఎన్నుకోవాల్సి ఉంది. దీంతో విశాఖ నగర ప్రజలే కాదు యావత్ ఉత్తరాంధ్ర, ఎపి వాసులూ విశాఖ వైపు ఆసక్తిగా చూస్తున్నారు. శనివారం జరిగే మేయర్ ఎన్నిక సందర్భంగా కార్పొరేటర్లు, ఎక్స్అఫీషియో సభ్యులు మినహా సమావేశ కౌన్సిల్‌లోకి మీడియాకు సైతం నో ఎంట్రీ అని జివిఎంసి ఇన్‌ఛార్జి కమిషనర్, విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేందిర ప్రసాద్ ఆదేశించినట్లు జివిఎంసి అధికారులు శుక్రవారం సాయంత్రం వెల్లడించారు. శనివారం ఉదయం 11 గంటలకు ప్రత్యేక కౌన్సిల్ మేయర్ ఎన్నిక కోసం జరుగనుంది.

మేయర్ పీఠమే లక్ష్యంగా 'కూటమి'

మేయర్ పీఠాన్ని కైవసం చేసుకోవడానికి టిడిపికి చెందిన కార్పొరేటర్ పీలా శ్రీనివాసరావు నాయకత్వంలో కూటమి కార్పొరేటర్లు, నాయకులు అంతా కలసి వైసిపికి చెందిన కొందరు కార్పొరేటర్లకు గాలం వేసి తమ వైపు తిప్పుకున్న విషయం తెలిసిందే. జనసేన, టిడిపిలోకి చాలా మంది వైసిపి కార్పొరేటర్లు జారిపోయారు. కార్పొరేషన్‌లో 58 మంది ఉండే వైసిపి కార్పొరేటర్ల బలం గడచిన ఏడాది కాలంగా 30కి పడిపోయింది. నాలుగేళ్ల క్రితం కార్పొరేషన్ ఎన్నికల్లో 97 మంది కార్పొరేటర్లలో 58 మంది వైసిపి తరుపున గెలుపొందారు. మేయర్ పీఠం ఆ పార్టీకే దక్కింది.

2024 సాధారణ ఎన్నికల్లో రాష్ట్రంలో కూటమి అధికారంలోకి రావడంతో మేయర్ స్థానాన్ని దక్కించుకునే దిశగా తెలుగుదేశం నేతలు వ్యూహాలు రచించారు. వైసిపి నుంచి చేరికలకు తెరలేపారు. టిడిపి ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు మేయర్ స్థానాన్ని దక్కించుకోవడానికి నెరపని రాజకీయం లేదు. ఎలాగైనా అవిశ్వాసం నెగ్గాలని టిడిపి, జనసేన, బిజెపి కార్పొరేటర్లు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. శనివారం ఉదయం 11 గంటలకు మిగతా 2లో..



కెజిహెచ్‌లో రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకుంటున్న మంత్రి డోలా

కెజిహెచ్‌లో మరొక గైనకాలజీ వార్డు

జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాలాంజనేయ స్వామి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఉత్తరాంధ్ర ఆరోగ్య ప్రదాయినిగా పేరుగాంచిన కెజిహెచ్‌లో కొత్తగా మరొక గైనకాలజీ వార్డును ఏర్పాటు చేయనున్నట్టు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ, విశాఖ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి తెలిపారు. రూ.కోటితో క్యాజువాలిటీ అభివృద్ధి పనులు ఇప్పటికే చేపట్టినట్టు వెల్లడించారు. ఐసియు అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. శుక్రవారం ఆయన కెజిహెచ్‌లోని వివిధ విభాగాలను పరిశీలించారు. వైద్యులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ నాడు తాను విశాఖ ఆంధ్రా మెడికల్ కళాశాలలో వైద్య విద్యనభ్యసించానని తెలిపారు. ఒపి దగ్గర మహిళలకు ఫీడింగ్ రూమ్, చిల్డ్రన్స్ టాయిలెట్స్ ఏర్పాటు చేయాలన్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులతో సిబ్బంది ఆప్యాయంగా, మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. అన్ని విభాగాల్లో ఫైర్ సేఫ్టీ మెజర్స్ అందుబాటులో ఉండాలన్నారు. రోగుల నుంచి సిబ్బంది ఎవరైనా లంచం తీసుకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆస్పత్రిలో శిశు మార్పిడిలు జరగడానికి వీల్లేదన్నారు. సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అవసరమైన అదనపు మిగతా 2లో..

21న వైద్య ఆరోగ్య రంగంపై సదస్సు

వార్త 2లో..

ఉపాధి హామీ వేతన బకాయిలపై నిరసనలు

వార్త 5లో..

పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు చర్యలు

వార్త 5లో..



భారీ ర్యాలీలో పాల్గొన్న ముస్లిము మహిళలు

వక్ఫ్ చట్ట సవరణపై భగ్గు

గాజువాకలో ముస్లిముల భారీ ర్యాలీ

వార్త 4లో..

విసిఐసి భూ సేకరణలో ఉల్లంఘనలు

- డి పట్టా భూమిలో చెట్లకు ఇవ్వని పరిహారం
- సాగు భూమికి పైసా చెల్లించని వైనం
- సాగుదారుల గుర్తింపులో కోత
- మేజర్లకు ప్రకటించని ప్యాకేజీ
- అన్నింటా అశ్రద్ధ



పేదల డి పట్టా భూమిలోని జీడితోట

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

'కొబ్బరి చెట్టుకు ఐదు వేలు ఇస్తామని చెప్పి రూ.4,500కు తగ్గించారు. చివరకు చెట్టుకు చెల్లించే నష్టపరిహారం విషయం చెప్పకుండా బ్యాంకు ఖాతాల్లో చెట్టుకు రూ.1500, రూ.500, రూ.300 వేశారు' అని మూలపర్రకు చెందిన సూరకాసుల బాబూరావు తెలిపాడు. నక్కపల్లి మండలంలోని విశాఖ - చెన్నయ్ ఇండస్ట్రియల్ కారిడార్ (విసిఐసి) భూ సేకరణలో పోయిన 90 కొబ్బరి చెట్లకు రూ.1500 చొప్పున డబ్బులు జమచేసినట్లు ఆయన చెప్పాడు. ఇక్కడి అందిరి పరిస్థితీ అలానే ఉంది. జిరాయితీ భూముల్లోని ఏ రకం చెట్టుకు ఎంత జమచేశారో కూడా అధికారులు చెప్పలేదని 'ప్రజాశక్తి' వద్ద పలువురు రైతులు వాపోయారు. విసిఐసి భూ సేకరణలో ఎక్కడికక్కడ ఉల్లంఘనలు చోటు చేసుకుంటున్నట్టు క్షేత్రస్థాయి పరిశీలనను బట్టి అర్థమవుతోంది.

జిల్లాలోని నక్కపల్లి మండల సముద్రతీర గ్రామాలు డిఎల్.పురం, చందనాడ, వేంపాడు, రాజయ్యపేటలో 3,873.97 ఎకరాలను ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (ఎపిఐఐసి) సేకరించింది. సమాచార హక్కు చట్టం కింద సేకరించిన సమాచారం ప్రకారం సేకరించిన 3,873.97 ఎకరాల్లో జిరాయితీ భూమి 2,338.56 ఎకరాలు, డి పట్టా భూమి 752.90 ఎకరాలు, ప్రభుత్వ భూమి 724.21 ఎకరాలు, పేదల సాగులోని భూమి 58.30 సెంట్లు వుంది. వాస్తవానికి పేదల సాగులో ఐదు వందల ఎకరాలకుపైగా ఉన్నప్పటికీ ఆ మొత్తాన్ని నమోదు చేయలేదు.

జిరాయితీ భూమి ఎకరాకు రూ.18 లక్షలు, డి పట్టా భూమికి రూ.12.60 లక్షలు, సాగుదారుకు రూ.6.30 లక్షలు చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. జిరాయితీ భూమికి మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

నేడే అవిశ్వాసం

జివిఎంసిలో జరిగే ప్రత్యేక సమావేశంలో మేయర్‌ను ఎన్నుకోనున్నారు. ఈ ప్రత్యేక సమావేశానికి సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, సిపిఐ కార్పొరేటర్ స్టాలిన్ హాజరుకావడం లేదని ముందే ప్రకటించారు.

ఎవరు ఎలా నెగ్గుతారోనన్న ఆసక్తి

అవిశ్వాసం నెగ్గాలంటే ఏ పార్టీకైనా 74 మంది కార్పొరేటర్ల మద్దతు ఉండాలి. కూటమి ఆ ఫిగర్‌ను ఇప్పటికే దాటేసినట్లు స్పష్టమవుతోంది. అయితే కార్పొరేషన్‌లో మేయర్ స్థానం దక్కించుకునే మ్యాజిక్ ఫిగర్ లేకపోయినా వైసిపి మాత్రం కూటమి ఎలా గెలుస్తుందో చూస్తామంటూ ప్రకటనలు చేయడం తాజాగా కూటమి నేతలను కలవర పెడుతోంది. మూడు రోజుల క్రితమే వైసిపి నుంచి ముగ్గురు కార్పొరేటర్లు టిడిపి, జనసేనలో చేరడంతో మొత్తంగా కూటమి సంఖ్య 75కు చేరుకుంది. 74 మాత్రమే మేయర్ ఎన్నికకు కావాలి. అయితే గతంలో తమ పార్టీ బ్యానర్‌పై జివిఎంసి ఎన్నికల్లో గెలిచిన 58 మంది కార్పొరేటర్లకు వైసిపి విప్ జారీచేసింది. అవిశ్వాస తీర్మానానికి ఎవ్వరూ మద్దతు ఇవ్వొద్దంటూ ఈ విప్ జారీ సారాంశంగా ఉంది. అలాగే ఈ ప్రత్యేక సమావేశానికి హాజరు కాకూడదని వైసిపి నిర్ణయించింది. విప్ జారీచేసిన క్రమంలోనే వైసిపికి ఆరో వార్డు కార్పొరేటర్, వైసిపి మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు కుమార్తె లక్ష్మీ ప్రియాంక రాజీనామా చేశారు. కూటమి కార్పొరేటర్లంతా మలేషియా నుంచి శుక్రవారం సాయంత్రానికే విశాఖ నగరానికి చేరుకున్నారు. శనివారం ఉదయం దసపల్లా హోటల్‌కు వీరంతా చేరుకుని అక్కడ నుంచి ఏసీ బస్సుల్లో జివిఎంసి ప్రత్యేక కౌన్సిల్‌కు హాజరవుతారు. గడిచిన నెలరోజులుగా కర్నాటక, కేరళ, శ్రీలంకల్లో పర్యటనలు చేస్తున్న వైసిపి కార్పొరేటర్లు ఈ ప్రత్యేక కౌన్సిల్‌కు హాజరుకావడం లేదని తేల్చేశారు. ఇదిలా ఉండగా మేయర్‌పై అవిశ్వాసం, కౌన్సిల్ ప్రత్యేక సమావేశం నేపథ్యంలో జివిఎంసి వద్ద 500 మందితో అధికారులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

విసిఐసి భూ సేకరణలో ఉల్లంఘనలు

పరిహారమిచ్చి కొబ్బరి చెట్లకు ఐదు వేల చొప్పున చెల్లిస్తామని రూ.1500లోపే బ్యాంకు ఖాతాలో జమ చేసింది. బోర్లు, బావులకు పరిహారం ఇవ్వలేదు. డి.పట్టా భూములకు పరిహారం చెల్లించి కొబ్బరి, జీడిచెట్లకు డబ్బులు ఇవ్వలేదు. పేదల సాగుభూమికి ఇంతవరకు ఏ పరిహారమూ చెల్లించలేదు. 2016 మార్చి 31న డిఎల్.పురం, వేంపాడు, రాజయ్యపేట, చందనాడ ప్రజలతో జరిగిన సమావేశంలో సాగులోవున్న డి పట్టాదారునికి జిరాయితీ భూమి వలె పరిహారం చెల్లిస్తామని, ఎన్ఎఒబిలో సొసైటీ భూములకు పరిహారం ఇచ్చినట్లే ఈ గ్రామాల్లోని సొసైటీ భూములకు పరిహారం అందజేస్తామని అప్పటి ఉమ్మడి విశాఖపట్నం జిల్లా కలెక్టర్ ఎన్.యువరాజ్ లిఖితపూర్వకంగా తెలిపారు. కానీ, ఇక్కడ డి పట్టా భూములకు జిరాయితీ పరిహారం, ఎన్ఎఒబి తరహాలో సొసైటీ భూములకు పరిహారం చెల్లించలేదు.

ప్రభుత్వం భూ సేకరణ, పరిహారం, పునరావాసం కల్పనలో నిబంధనలను ఉల్లంఘించింది. 1894 భూ సేకరణ చట్టం, సెక్షన్ 3, సబ్ సెక్షన్ ఎఫ్‌లో 'ప్రజా ప్రయోజనం' ప్రకారం సేకరించిన భూమి ప్రభుత్వ రంగ సంస్థలకు ఉపయోగించాలి తప్ప ప్రయివేటు సంస్థలకు బదలాయించకూడదు. ఆ నిబంధనలను ఉల్లంఘించి ప్రైవేట్ కంపెనీ ఆర్సెలార్ మిట్టల్‌కు 2,200 ఎకరాలు ప్రభుత్వం కేటాయించింది. 2013 భూ సేకరణ చట్టం అమలులోకి వచ్చిన తరువాత 1894 చట్టం కింద విచారణ కొనసాగుతోంది గనుక భూ యజమానులకు, భూమిపై ఆధారపడి బతుకుతున్న పేదలు, మత్స్యకారులు, చేతివృత్తిదారులకు 2013 భూ సేకరణ చట్టం వర్తింపజేయాల్సివుంది. కానీ చట్టపరమైన నిబంధనలు పాటించకుండా ప్రయివేటు స్టీల్‌ప్లాంట్‌కు తొలిదశలో 2,200 ఎకరాలు కేటాయించిన ప్రభుత్వం ఇటీవల క్యాప్టివ్ పోర్టుకు కూడా ఆమోదం తెలిపింది.

సిపిఎం ప్రజా చైతన్య యాత్రలో వెలుగుచూసిన సమస్యలు

గత నెల 11న విసిఐసి నిర్వాసిత గ్రామాలైన కాగిత, పాటిమీద, తమ్మయ్యపేట, రాజయ్యపేటలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు చేపట్టిన ప్రజా చైతన్యయాత్రలో నిర్వాసితుల సమస్యలు వెలుగుచూశాయి. తరలించాల్సిన రాజయ్యపేట, చందనాడ, బుచ్చిరాజుపేట, వేంపాడు, డిఎల్ పురంలో 784 కుటుంబాలను అధికారులు గుర్తించారు. తరలించాల్సిన గ్రామాల కుటుంబాల గుర్తింపు ప్రక్రియ పూర్తికాలేదు. అందరికీ పరిహారం చెల్లించలేదు. వీరందరికీ పునరావాసం కల్పించాల్సిన స్థలం చర్చల స్థాయిలోనే వుంది. కానీ మిట్టల్‌కు మాత్రం భూములను ప్రభుత్వం కేటాయించింది. పిడిఎఫ్ కుటుంబాల్లోని మేజర్లకు రూ.25 లక్షలు ఇవ్వాలని నిర్వాసితులు డిమాండ్ చేస్తుండగా 2023లో ప్రకటించిన రూ.8.36 లక్షలు ఇచ్చి చేతులు దులుపుకోవాలని ప్రభుత్వం చూస్తోంది. మిట్టల్ స్టీల్‌కు వివిధ రాయితీలు ప్రకటించిన ప్రభుత్వం భూములు, ఊరు, ఉపాధి కోల్పోయిన నిర్వాసితులకు మాత్రం పరిహారం, ప్యాకేజీ చెల్లింపుపై శ్రద్ధచూపడంలేదు. 'మాకు జరుగుతున్న అన్యాయంపై మా ఎమ్మెల్యే, హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత పట్టించుకోవడంలేదు' అని నిర్వాసితులు వాపోయారు.

పరిహారం, ప్యాకేజీ చెల్లించే వరకూ పనులు ఆపాలి

భూ సేకరణలో భూములు, చెట్లు, ఉపాధి కోల్పోయిన వారందరికీ పరిహారం చెల్లించాలి. తరలించాల్సిన గ్రామాల్లోని మేజర్లకు ప్యాకేజీ రూ.25 లక్షలు ఇవ్వాలి. పరిహారం, పునరావాసం పూర్తిగా చెల్లించకుండా, ప్యాకేజీ చెల్లింపుపై స్పష్టత ఇవ్వకుండా ప్రయివేటు పరిశ్రమలకు భూములు కేటాయించడం సరికాదు. పరిహారం, పునరావాసం, ప్యాకేజీ చెల్లింపు పూర్తయ్యే వరకూ నిర్మాణ పనులు నిలిపివేయాలి. బాధితులందరికీ న్యాయం చేయాలి.

ఎం.అప్పలరాజు, సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు

కెజిహెచ్‌లో మరొక గైనకాలజీ వార్డు

భవనాలు నిర్మిస్తామని, సిబ్బందిని నియమిస్తామని అన్నారు. మందుల కొరతపై ఒక విలేకరి ప్రశ్నించగా తనకు ఇప్పుడే ఈ విషయం తెలిసిందని, పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని సమాధానమిచ్చారు. ఆసుపత్రిలోని అన్ని విభాగాలను మంత్రి పరిశీలించారు. రోగులతో స్వయంగా మాట్లాడి వారికి అందుతున్న వైద్య సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. పలు రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్, కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

21న వైద్య ఆరోగ్య రంగంపై సదస్సు



సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం ఆరోగ్య విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 21న 'వైద్య ఆరోగ్య రంగాలు - ప్రభుత్వ కాలేజీల ప్రైవేటీకరణ ప్రభావాలు' అన్న అంశంపై సదస్సు నిర్వహిస్తున్నట్లు అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం ప్రోగ్రామ్స్ ఇన్‌ఛార్జి జిఎస్.రాజేశ్వరరావు తెలిపారు. శుక్రవారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాజేశ్వరరావు, పూర్వ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి.రామారావు, ఆంధ్ర మెడికల్ కాలేజీ పూర్వ గైనిక్ విభాగాధిపతి డాక్టర్ వైఎల్.నర్సింగరావు, యువజన విభాగం కార్యదర్శి కె.సంతోష్ కుమార్, డాక్టర్ అన్వేష్ పాల్గొని సదస్సు పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజేశ్వరరావు మాట్లాడుతూ కీర్తిశేషులు ప్రజా వైద్యులు, జన విజ్ఞాన వేదిక జిల్లా నాయకులైన డాక్టర్ కె.హరి ప్రసాద్ స్మృత్యర్థం ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో విశ్రాంత ఐఎఎస్ అధికారి, ఎపి పూర్వ హెల్త్ సెక్రటరీ డాక్టర్ పివి.రమేష్, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ సత్యవరప్రసాద్ పాల్గొని ప్రసంగిస్తారని వెల్లడించారు. దీనికి ప్రజారోగ్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎంవి.రమణయ్య అధ్యక్షత వహిస్తారని తెలిపారు. డాక్టర్ పి.రామారావు మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యంగా వుంటే సమాజం ఆరోగ్యంగా ఉంటుందని, కావున ప్రభుత్వమే వైద్య ఆరోగ్య రంగాన్ని నిర్వహించాలని అన్నారు. కానీ దీనికి భిన్నంగా ప్రభుత్వాలు చర్యలు చేపడుతున్నాయని, రాష్ట్రంలో నిర్మాణంలో వున్న పది ప్రభుత్వ మెడికల్ కాలేజీలను పిపిపి పద్ధతిలో నిర్వహిస్తామని చెప్పడం అంటే ఇది అంతిమంగా ప్రైవేటీకరణకు దారితీస్తుందని అన్నారు. వైద్య విద్య ఖరీదై ఎక్కువ మంది విద్యార్థులకు అందని ద్రాక్ష అవుతుందని, మెడికల్ సీట్లను కొనుక్కుని డాక్టర్లు అయినవారు సామాజిక బాధ్యతకు తిలోదకాలిస్తారని తెలిపారు. వైద్యం ప్రజలకు అందుబాటులో ఉండదన్నారు. డాక్టర్ వైఎల్.నర్సింగరావు మాట్లాడుతూ దేశ స్థూల జాతీయోత్పత్తిలో ఐదు శాతం వైద్య ఆరోగ్య రంగం కోసం ఖర్చు పెట్టాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలిపిందని, కానీ ప్రభుత్వాలు ఆ రంగం మీద చాలా నామమాత్రంగానే ఖర్చుపెడుతున్నాయని అన్నారు. పేద ప్రజలు తమ ఆరోగ్యాలు బాగు చేసుకోవడానికి జేబుల్లోంచి ఎక్కువగా ఖర్చు పెట్టాల్సి వచ్చి, వారు మరింత పేదరికంలోకి జారిపోతున్నారని చెప్పారు. కావున ప్రభుత్వాలు ప్రైవేటీకరణ విధానాలు విడనాడాలన్నారు. 21న తలపెట్టిన సదస్సును జయప్రదం చేయాలని కోరారు.

వైసిపి హయాంలో కుంటుపడిన అభివృద్ధి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వైసిపి ప్రభుత్వ హయాంలో ఉత్తరాంధ్ర అభివృద్ధి కుంటుపడిందని విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ విమర్శించారు. శుక్రవారం టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడుతో కలిసి ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్రకు గతంలో వచ్చిన సంస్థలు వైసిపి ప్రభుత్వంలో వెనక్కి వెళ్లిపోయాయన్నారు. విశాఖలో 33 ప్రభుత్వ ఆస్తులు తాకట్టు పెట్టి అప్పులు తెచ్చారన్నారు. ఒకరి ఇల్లు కోసం రూ.450 కోట్లు వైసిపి ప్రభుత్వం ఖర్చు పెట్టిందని ఆరోపించారు. కూటమి హయాంలో భోగాపురం ఎయిర్ పోర్టు కనెక్టివిటీ కోసం రూ.400 కోట్లుతో 17 రోడ్లను ప్రతిపాదించినట్టు తెలిపారు. టిసిఎస్ యూనిట్‌ను విశాఖలో ఏర్పాటు చేయాలని కోరగా ఆ సంస్థకు చెందిన వారు సానుకూలంగా స్పందించారన్నారు. ఐటి సంస్థలు అడిగిన చిన్న, చిన్న విషయాలను గత ప్రభుత్వం నెరవేర్చలేకపోయిందన్నారు. విద్యా ప్రమాణాలు పెరగాలనేదే తమ ఆలోచన అన్నారు. విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ అభివృద్ధి చూసి ఓర్వలేక వైసిపి నాయకులు అసత్య ప్రచారాలు చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కో-ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్, టిడిపి జిల్లా అధ్యక్షులు గండి బాబ్జి, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ నజీర్, జిల్లా ప్రధాన కార్యదర్శి పొలమరశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సంస్థాగత ఎన్నికలు సక్రమంగా నిర్వహించాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : టిడిపి సంస్థాగత ఎన్నికలను సక్రమంగా నిర్వహించాలని విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ అన్నారు. శుక్రవారం పార్టీ జిల్లా కార్యాలయంలో పార్టీ కార్యకర్తల సమావేశం జిల్లా అధ్యక్షులు గండి బాబ్జి అధ్యక్షతన జరిగింది. ఎన్నికలపై శ్రీభరత్ పలు సూచనలు చేశారు. బూత్ స్థాయి నుంచి పార్టీ ఎన్నికలు సజావుగా జరిగేందుకు కార్యకర్తలు కృషి చేయాలని చెప్పారు. ప్రతి వార్డులో ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నిక జరిగే విధంగా దోహదపడాలన్నారు. మాజీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ నజీర్ పాల్గొన్నారు.

14 నుంచి శ్రీ ఎర్నిమాంబ వార్షికోత్సవం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జ్ఞానాపురంలో ప్రసిద్ధి చెందిన శ్రీ ఎర్నిమాంబ అమ్మవారి వార్షికోత్సవ వేడుకలను మే 14 నుంచి 18 వరకు వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డివిఎస్.సురేష్ బాబా మీడియాకు తెలిపారు. ఈ ఏడాది నుంచి భక్తుల సౌకర్యార్థం ఐదు రోజులపాటు వేడుకలు జరపదలిచామని పేర్కొన్నారు.

నేడు విశాఖలో దేవిశ్రీ ప్రసాద్ లైవ్ మ్యూజిక్ కాన్సర్ట్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రాక్ స్టార్ దేవిశ్రీప్రసాద్ లైవ్ ఇండియా టూర్‌లో భాగంగా ఏటీసీటీ ఈవెంట్ మేనేజ్మెంట్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం విశాఖపట్నంలోని పోర్టు స్టేడియం వేదికగా మ్యూజిక్ కాన్సర్ట్ నిర్వహిస్తున్నామని ప్రముఖ సంగీత దర్శకుడు దేవిశ్రీప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆయన శుక్రవారం ఉదయం బీచ్ రోడ్‌లోని నోవాటెల్ హోటల్‌లో ఆవిష్కరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ తన మొదటి సినిమా ఆనందం నుంచి మ్యూజిక్ షోలు చేయాలని అనుకుంటున్నానని, ఈ క్రమంలోనే దేశంలోని ప్రధాన పట్టణాల్లో రాక్ స్టార్ డిఎస్‌పి లైవ్ ఇండియా టూర్ పేరిట మ్యూజిక్ షోలు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. ఏపీసీటీ సభ్యుడు శోభన్ మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి సంబంధించి అన్ని అనుమతులూ తీసుకున్నామని, 9800 మందికి అధికారులు అనుమతి ఇచ్చారని తెలిపారు. .

స్కోడా కొడియాక్ బుకింగ్స్ ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రముఖ ఆటోమొబైల్ సంస్థ స్కోడా ఆటో ఇండియా తన నూతన వాహనమైన స్కోడా కొడియాక్ బుకింగ్స్‌ను విశాఖలో ప్రారంభించినట్లు స్కోడా ఆటో ఇండియా బ్రాండ్ డైరెక్టర్ పీటర్ జనేబా తెలిపారు. సిరిపురంలోని ఒక ప్రయివేటు హోటల్‌లో శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వాహనాల డెలివరీలు మే 2 నుంచి ఉంటాయన్నారు. నూతన వాహనం 320 ఎన్ఎం టార్కును ఉత్పత్తి చేసే 2.0 టిఎస్ఐ ఇంజిన్‌తో పనిచేస్తుందని, సెవెన్ స్పీడ్ డ్యూయల్ క్లచ్ డి ఎస్‌జి ఆటోమేటిక్ ద్వారా రెండు యాక్సిల్‌లకు అనుసంధానం చేయబడిందని తెలిపారు. లీటర్‌కు 14.86 కిలోమీటర్ల మైలేజీ అందిస్తుందని తెలిపారు. వాహనాల ప్రారంభ ధర రూ.46,89,000గా ఉందన్నారు.

'అర్జున్ సన్ ఆఫ్ వైజయంతి' విజయోత్సవం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : శుక్రవారం విడుదలైన నందమూరి కల్యాణ్ రామ్ చిత్రం అర్జున్ సన్ ఆఫ్ వైజయంతి విజయోత్సవ కార్యక్రమం జగదాంబ థియేటర్‌లో విశాఖ సిటీ ఎన్‌టిఆర్, కల్యాణ్ రామ్ ఫ్యాన్స్ ఆధ్వర్యంలో శనివారం జరిగింది. ముఖ్యఅతిథిగా తెలుగు శక్తి అధ్యక్షులు బివి.రామ్ హాజరయ్యారు.

రోజా వ్యాఖ్యలు హేయం

ప్రజాశక్తి- సీతమ్మధార : టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌ను ఉద్దేశించి మాజీ ఎమ్మెల్యే రోజా చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి సత్యనారాయణ అన్నారు శుక్రవారం పౌర గ్రంథాలయంలో విలేకరులతో మాట్లాడుతూ, మంత్రిగా, ఎమ్మెల్యేగా, వివిధ పదవుల్లో ఉన్న రోజా ఒక్క మంచిపనైనా చేయలేదని, సినిమా టిక్కెట్లు అమ్ముకున్న మాదిరిగా టిటిడి దర్శనటిక్కెట్లు వ్యాపారం చేసిందని ఆరోపించారు. వైసిపి హయాంలో తిరుమలలో అన్యమత ప్రచారం చేశారన్నారు. కార్పొరేటర్ మూర్తియాదవ్ మాట్లాడుతూ, ఒంటిమిట్టలో కల్యాణోత్సవాలు జరుగుతున్న సమయంలో టిటిడి గోశాలపై రాద్ధాంతం చేయడం సరికాదన్నారు. వైజాగోడు అంటూ అవమానకరంగా బిసి నేత, ఎమ్మెల్యే పల్లాను ఉద్దేశించిన రోజా చేసిన వ్యాఖ్యలు విశాఖ వాసులంటే ఆమెకున్న చులకన భావాన్ని స్పష్టం చేస్తున్నాయన్నారు. పవన్, పల్లాకు తక్షణమే బేషరతుగా రోజా బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేకుంటే విశాఖలో అడుగుపెట్టనీయబోమని హెచ్చరించారు.

అంబేద్కర్ విగ్రహాన్ని తొలగించాలన్న ఆర్‌డిఒపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి- పెందుర్తి : జివిఎంసి 97వ వార్డు చిన ముషిడివాడ ఆక్సిజన్ డిఫెన్స్ కాలనీలోని అంబేద్కర్ విగ్రహాన్ని తొలగించాలని ఆదేశించిన విశాఖ ఆర్‌డిఒ శ్రీలేఖ చర్యలను సిపిఎం గోపాలపట్నం జోన్ కమిటీ కార్యదర్శి బి.జగన్ ఒక ప్రకటనలో ఖండించారు. సెలవు రోజున ఆ కాలనీకి చెందిన దళిత బహుజనులను తన కార్యాలయానికి రప్పించి, అంబేద్కర్ విగ్రహాన్ని తొలగించమని చట్ట విరుద్ధంగా ఆదేశించడమే కాకుండా, తన కార్యాలయంలో కొద్దిసేపు నిర్బంధించిన ఆర్‌డిఒ శ్రీలేఖ చర్యలు సరికాదన్నారు. బహుజనుల సమక్షంలోనే ప్రభుత్వస్థలంలో ఉన్న విగ్రహాన్ని తొలగించాలని ఫోనులో తహశీల్దార్‌ను ఆదేశించడం సరికాదన్నారు. ఎన్నోఏళ్లుగా ఉన్న విగ్రహాన్ని తొలగించాలన్న ఆదేశాలపై దీనిపై సమగ్ర విచారణ చేపట్టి, ఆర్‌డిఒ శ్రీలేఖపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సిఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి-గోపాలపట్నం : విశాఖ పశ్చిమ నియోజకవర్గ పరిధిలో ముఖ్యమంత్రి సహాయనిధి కింద ఆర్థికసాయం మంజూరైన లబ్ధిదారులకు చెక్కులను స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ పెతకంశెట్టి గణబాబు శుక్రవారం పంపిణీచేశారు. గోపాలపట్నం ప్రాంతానికి చెందిన జనకల సత్యనారాయణకు రూ.1,95,110. కొమ్ముల దుర్గాదేవికి రూ.47,142, రాజా రామలక్ష్మీకి రూ.40వేలు. లక్ష్మీనగర్ ప్రాంతానికి చెందిన బుర్రరాజు కృష్ణకార్తీక్‌కు రూ.2,07703, వలసపల్లి అప్పన్నకు రూ.2,56,000, బొత్స గౌరికి రూ.13,836, కాళీమాత ఆలయం పంతులుకు రూ.1,96000, ఇందిరానగర్ ప్రాంతానికి చెందిన బంగారు శ్రీనుకు రూ.47,237, ముల్లి సుందరయ్యకు రూ.1,29,400. నరసింహగర్ ప్రాంతానికి చెందిన రెడ్డి పైడినాయుడుకు రూ.3,50,309. సిఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను స్వయంగా వారి లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక తెలుగుదేశం, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

ప్రజాశక్తి -తగరపువలస : జివిఎంసి రెండో వార్డు జీరుపేటకు చెందిన తన కొడుకు బైరెడ్ల రామకృష్ణ (32) రెండు రోజులుగా కనిపించడం లేదని ఆయన తండ్రి తండ్రి నారాయణమూర్తి గురువారం రాత్రి భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు చెప్పిన వివరాలివి. బికాం చదివిన బైరెడ్ల రామకృష్ణ కొన్నాళ్లు మతి స్థిమితం లేకుండా ఉన్నాడు. ఈ నెల 16న మధ్యాహ్నం 12.30 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లిన రామకృష్ణ, ఎంతకీ తిరిగి రాలేదు.దీంతో బంధువులు, స్నేహితులు ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. రామకృష్ణ ఎత్తు 5.7 అడుగులు పొడవుతో తెలుపు రంగులో ఉంటాడని, ఇంటి నుంచి వెళ్లిన సమయంలో బ్లూ కలర్ ఫాంట్, తెలుపు రంగు టీ షర్ట్ ధరించి ఉన్నాడు. అందిన ఫిర్యాదుతో హెడ్ కానిస్టేబుల్ బివి రమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేదింట పెద్ద కష్టం!

- జీవచ్ఛవంలా మారిన ఎదిగొచ్చిన కొడుకు
- ప్రమాద గాయంతో నాలుగేళ్లుగా మంచానికే పరిమితం
- సాక లేక, చావ లేక విలవిల్లాడిపోతున్న మాతృమూర్తి
- ప్రభుత్వం, దాతల సాయానికి ఎదురుచూపులు



వీల్‌చైర్‌లో ఉన్న మోహనకృష్ణ

ప్రజాశక్తి -ఆనందపురం : నాలుగేళ్ల క్రితం వరకు అందరిలాగానే ఆడుతూ, పాడుతూ తిరుగుతూ, ఇంటర్ వరకు చదువుకున్న ఆ యువకుడు అనుకోని ప్రమాదంలో నడుము, కాళ్లు చచ్చుబడిపోయి జీవచ్ఛవంలా మారి మంచానికే పరిమితమయ్యాడు. రెక్కాడితేగాని డొక్క నిండని నిరుపేద కుటుంబంలోని ఏకైక కుమారుడు అందొచ్చి, ఆదుకుంటాడని భావిస్తే, ఇలా ఆవిటివాడు కావడంతో ఆ తల్లి వేదన అంతాఇంతా కాదు. ప్రభుత్వం, దాతలెవరైనా ఆదుకుని తనకు ఆసరాగా నిలవాలని బాధిత యువకుడు వేడుకుంటున్నాడు. వివరాలివి.

అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం ఉద్దండపురం గ్రామానికి చెందిన కుర్ర నాగేశ్వరరావు, నాగలక్ష్మి దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు. ఇంటిపెద్దదిక్కు కష్టంపైనే కుటుంబ పోషణ సాగుతున్న పరిస్థితుల్లో పదేళ్ల క్రితం నాగేశ్వరరావు అకాలమరణంలో ఆ కుటుంబం దిక్కులేనిదైంది. స్థానికంగా కూలి పనులు చేస్తూ పిల్లలను పోషిస్తున్న నాగలక్ష్మి, తర్వాత మండలంలోని నేలతేరు కస్తూర్బా గాంధీ పాఠశాలలో కుక్‌గా చేరింది. వచ్చిన కాస్తో, కూస్తో సంపాదనతో అష్ట కష్టాలు పడి కుమార్తెలు శాంతికుమారి, గీతాలక్ష్మిల పెళ్లిచేసింది. కొడుకు మోహన్‌కృష్ణ (23) ఇంటర్మీడియట్ పూర్తి చేసి డిగ్రీ చదవడానికి ప్రయత్నాలు చేస్తుండగా, 2021 మే నెలలో స్నేహితులతో సరదాగా తాటి చెట్టు ఎక్కి, చెట్టు పైనుంచి కిందన పడడంతో నడుము రెండు కాళ్లు, చచ్చుబడి పోయాయి. అప్పటి వరకు కష్టాల్లోనైనా సాఫీగా సాగుతున్న ఆ కుటుంబం ఒక్కసారిగా భారీ కుదుపునకు గురైంది.

అందొచ్చిన కొడుకు మంచానపడడంతో అందినచోట అప్పులు చేసి చికిత్స చేసింది. రోజుకు రూ.800 చొప్పున వెచ్చించి ఫిజియోథెరపీ కూడా చేసినా, మోహనకృష్ణ ఆరోగ్యం బాగుపడకపోగా, వీల్‌చైర్‌కు పరిమితమైపోయాడు. ఆటపాటల్లో ఎంతో చలాకీగా ఉండే మోహన్‌కృష్ణ చదువుకునేరోజుల్లో ఉన్న ఆసక్తితో కంప్యూటర్ డిజైనింగ్ నేర్చుకున్నాడు. తాను మంచం పట్టిన తర్వాత ప్రభుత్వపరంగా ఎటువంటి సాయం అందలేదని మోహనకృష్ణ వాపోతున్నాడు. అధికారులు స్పందించి తనకు పింఛను మంజూరు చేయాలని కోరుతున్నాడు. తాను డిజైనింగ్ నేర్చుకున్న నేపథ్యంలో ప్రభుత్వం, ఏదైనా ప్రైవేటు సంస్థలు తనకు వర్క్ ఫ్రం హోం ఉద్యోగ అవకాశం కల్పించాలని కోరుతున్నాడు.9948876619 నంబర్‌కు సంప్రదించి, తనను ఆదుకోవాలని వేడుకుంటున్నాడు.

కార్మికుల ప్రయోజనాల చెల్లింపులో నిర్లక్ష్యం

సిఐటియు ఆధ్వర్యాన 'ఐనాక్స్' కంపెనీ ఎదుట ధర్నా



ఐనాక్స్ కంపెనీ గేటు వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

ప్రజాశక్తి - గాజువాక : ఆటోనగర్‌లోని ఐనాక్స్ ఎయిర్ ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో పనిచేస్తున్న కార్మికులకు రావాల్సిన ప్రయోజనాలు చెల్లింపులో యాజమాన్యం తీవ్ర నిర్లక్ష్యం చేస్తోందని, అయినా కార్మికశాఖ అధికారులు పట్టించుకోకపోవడం దారుణమని ఆటోనగర్ ఎంప్లాయిస్ యూనియన్, సిఐటియు అధ్యక్షుడు ఎం.రాంబాబు విమర్శించారు. శుక్రవారం కంపెనీ గేటు ఎదుట సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ, ఐనాక్స్ కంపెనీలో పాతికేళ్లు పనిచేసిన తాతారావు అనే కార్మికుడికి గ్రాట్యూటీ, పీఎఫ్ వంటి బెనిఫిట్స్ చెల్లించకపోవడం దారుణ మన్నారు. తక్షణమే చెల్లింపులు చేపట్టకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఐనాక్స్‌తోపాటు ఆటోనగర్‌లోని అనేక కంపెనీల్లో పనిచేస్తున్న కార్మికులకు భద్రత కల్పనలోనూ, రిటైర్మెంట్, ఇతరత్రా బెనిఫిట్స్ చెల్లింపుల్లోనూ యాజమాన్యాలు మొండిచేయి చూపినా సంబంధిత కార్మికశాఖ అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కార్మికశాఖ ఉండేది యాజమాన్యాలకు కొమ్ముకాయడానికా? లేకుంటే కార్మిక ప్రయోజనాల పరిరక్షణకా? అని ప్రశ్నించారు. కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వాలు కార్మికహక్కులను కాలరాస్తున్నాయని, తీవ్ర అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. కార్మికుల కోసం పోరాటం చేస్తున్న పార్టీలకు, ట్రేడ్ యూనియన్లకు కార్మికులుమద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు కార్యక్రమంలో సిఐటియు జోన్ నాయకులు వైస్ ప్రెసిడెంట్ తాతారావు వి రాజు వి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఇద్దరు బైక్ దొంగల అరెస్ట్

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : విశాఖ నగరంలో వరుసగా ద్విచక్ర వాహనాల చోరీకి పాల్పడుతున్న ఇద్దరు అంతరరాష్ట్ర దొంగలను అరెస్టు చేసినట్లు నగర పోలీస్ కమిషనరేట్ కార్యాలయ అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది జనవరి 22న తమ ఇంటిముందు పార్క్ చేసిన రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్ చోరీకి గురైందని అల్లిపురం ప్రాంతానికి చెందిన అన్సార్ అలీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన రెండో పట్టణ పోలీసులు, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు క్రైమ్ ఎస్ఐ ఎన్ సునీల్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి గాలింపులు చేపట్టగా ఒడిశా కోరాపుట్‌కు చెందిన కిల్లో కార్తీక్, అతని స్నేహితుడు బాబుల సుపియా నిందితులుగా గుర్తించారు. నిందితులను విచారించగా, నగర పరిధిలోనే మరో ఎనిమిది మోటారు సైకిళ్లను దొంగతనం చేసినట్టు అంగీకరించారని పేర్కొన్నారు. నిందితుల నుంచి రూ.పది లక్షల విలువచేసే మూడు రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌లు, నాలుగు యమహా ఆర్ 15లు, ఒక కెటిఎమ్ ఆర్‌సి 200, ఒక యమహా ఎఫ్‌జెడ్ వాహనంతో సహా తొమ్మిది వాహనాలను రికవరీ చేశామన్నారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు ప్రకటనలో పేర్కొన్నారు.

నేరాలు ఘోరాలు

పలు చోరీ కేసుల్లో నలుగురు నిందితుల అరెస్టు



వివరాలు వెల్లడించిన క్రైమ్ ఎడిసిపి మోహనరావు

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ : విశాఖ నగరంలో దొంగతనాలకు పాల్పడుతున్న నలుగురు నిందితులను అరెస్టు చేసినట్లు క్రైమ్ ఎడిసిపి మోహనరావు తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఎంవిపి కాలనీ పోలీస్ స్టేషన్‌లో మీడియాతో మాట్లాడుతూ ఈనెల 15న, మద్దిలపాలెం చైతన్యనగర్‌లో హేమలత అనే వృద్ధురాలి ఇంటికి అద్దెకు ఇళ్లుకావాలని వచ్చి ఆమె మెడలోని గొలుసు, చేతి గాజులు లాక్కెళ్లిన ఘటనలో బాధితురాలి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టి, ఈనెల 17న సాయంత్రం కెఆర్ఎం కాలనీలోని సిరిపురపు వెంకటరమణ అనే వ్యక్తిని నిందితునిగా గుర్తించి అరెస్టు చేశామన్నారు. పోలీసుల విచారణలో చోరీసొత్తును నిందితుడు ముత్తూట్ ఫైనాన్స్‌లో రూ.2.8 లక్షలకు తాకట్టు పెట్టినట్లు గుర్తించి బంగారు ఆభరణాలను రికవరీ చేశామన్నారు.

మరో కేసులో ఈనెల 15న ఎంవిపి కాలనీ సెక్టార్ 8లో నివసిస్తున్న సేవన లలిత వృద్ధురాలు తన ఇంటి వరండాలో నిద్రిస్తుండగా రెండు తులాల గొలుసును చోరీ చేసిన ఘటనలో పిడుగు జగదీష్ అనే నిందితుడిని ఈనెల 17వ తేదీ సాయంత్రం అరెస్ట్ చేసి విచారించగా చోరీ సొత్తును ఫెడరల్ బ్యాంకులో రూ.1.29 లక్షలకు తాకట్టు పెట్టినట్టు అంగీకరించాడన్నారు ఫెడరల్ బ్యాంకు నుంచి వీటిని రికవరీ చేయాల్సి ఉందన్నారు.

ఈనెల 10న శివాజీపాలెంలో శోభారాణి అనే మహిళ తన ఇంటి ముందు వాకిలి శుభ్రం చేస్తుండగా బైక్‌పై ఇద్దరు వ్యక్తులు వచ్చి ఆమె మెడలోని నాలుగు తులాల బంగారు గొలుసులు దొంగిలించిన ఘటనలో విజయవాడ, ఎన్టీఆర్ జిల్లాలకు చెందిన నామాల నాగరాజు, షేక్ ఇమ్రాన్ అనే ఇద్దరు నిందితులను అరెస్టు చేశామనారు. వీరు ఎంవిపి, పీఎం పాలెం, హార్బర్ పోలీస్ స్టేషన్లపాటు విజయవాడ అజిత్‌సింగ్ నగర్ పోలీస్ స్టేషన్లలో ఆరు కేసులలో నిందితులుగా ఉన్నట్లు గుర్తించామని, నిందితుల 8 తులాల బంగారం, రూ.30 వేల నగదు, సుజుకి యాక్సెస్ వాహనం రికవరీ చేశామన్నారు. నిందితులలో నామాల నాగరాజుపై ఇప్పటికే 35 కేసులు ఉన్నాయని , ఇమ్రాన్‌పై 16 నాన్ బయలబుల్ వారెంట్ల తో పాటు 25 పాత కేసులు కేసులు ఉన్నాయని గుర్తించామన్నారు. మీడియా సమావేశంలో ద్వారక సబ్ డివిజన్ సిఐ చక్రధరరావు, ఎస్ఐ అప్పలరాజు పాల్గొన్నారు.

60 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:ఏజెన్సీ నుంచి అక్రమంగా టీవీ బాక్సుల్లో తరలిస్తున్న 60 కేజీల గంజాయిని పట్టుకున్నామని నర్సీపట్నం డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం డీఎస్పీ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. నర్సీపట్నం మండలం గబ్బాడ ప్రాంతంలో రూరల్ సీఐ ఎల్.రేవతమ్మ, ఎస్సై రాజారావు ఆధ్వర్యంలో పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారన్నారు. ఈ సమయంలో ద్విచక్ర వాహనంపై వస్తున్న ఇద్దరు వ్యక్తులు పోలీసులను చూసి దూరంగా ఆగి పోయారన్నారు. కోయంబత్తూరుకు నుంచి వచ్చిన వారు గంజాయిని తీసుకుంటుండగా దాడి చేసి పట్టుకున్నామని తెలిపారు. ఈ దాడిలో ఆరుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి ఆరు సెల్ ఫోన్లు, ఒక ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న డిఎస్‌పి శ్రీనివాసరావు

24న మెగా జాబ్‌మేళా



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

ప్రజాశక్తి-గోపాలపట్నం : ఎపి స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా ఈనెల 24న గోపాలపట్నం ఉన్నతపాఠశాల ప్రాంగణంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ పి.గణబాబు తెలిపారు. శుక్రవారం పశ్చిమ నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో జాబ్ మేళా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జాబ్ మేళాలో ఐటి, పార్మసీ, వివిద మార్కెటింగ్, వాణిజ్య, ట్రాన్స్‌పోర్టు, హాస్పిటల్స్ ఇలా వివిధ చెందిన సుమారు 53 ప్రైవేట్‌రంగ సంస్థలు జాబ్‌మేళాలో పాల్గొని, తమ కంపెనీల్లో ఉద్యోగాలకు అర్హులైన వారిని ఎంపిక చేస్తారన్నారు.

ఇంటర్వ్యూలు నిర్వహించిన వెంటనే ఎంపికైన అభ్యర్థులకు జాబ్‌మేళాలోనే నియామక పత్రాలను ఆందజేసా_రన్నారు. నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.కార్యక్రమంలో కూటిమి నాయకులు పాల్గొన్నారు.

రుషికొండ ప్యాలెస్‌ను రాష్ట్ర మ్యూజియంగా మార్చాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: రుషికొండ ప్యాలెస్‌ను రాష్ట్ర మ్యూజియంగా మార్చాలని బుద్ధిస్ట్ మాన్యుమెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి వెంకటరమణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం విజెఎఫ్ ప్రెస్ క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ, దీనిపై అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, ఎమ్మెల్యేలు విష్ణుకుమార్ రాజు, వంశీకృష్ణ శ్రీనివాస్‌లకు విన్నవించగా, ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారన్నారు.

ఉమ్మడి విశాఖ జిల్లా, ఉత్తరాంధ్ర ప్రాంతంలో తొట్లకొండ, బొజ్జన్నకొండ, భావికొండ ప్రాంతాల్లో బౌద్ధ చారిత్రక వారసత్వం కలిగిన కట్టడాలతోపాటు జైనమతం ఆనవాళ్లు కూడా ఈ ప్రాంతంలో అనేకం ఉన్నాయన్నారు. ఒడిశా బరంపురం నుండి చెన్నై తీర ప్రాంతం వరకు కళింగ ప్రాంతంలో తెలుగు భాష, సాంస్కృతిక సాంప్రదాయాలు చెప్పుకోదగ్గ ఉన్నాయని వివరించారు.రాష్ట్ర విభజన తర్వాత హైదరాబాద్‌లో మ్యూజియంలో ఉండిపోవడంతో విభజిత ఆంధ్రప్రదేశ్‌లో ప్రత్యేకంగా రాష్ట్ర స్థాయి మ్యూజియం లేనందున రుషికొండ ప్యాలెస్‌ను చారిత్రక వారసత్వ సంపదను భద్రపరిచే నిలయంగా మార్చాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో దళిత నేతలు జి.అప్పారావు, అల్లు అప్పారావు, జె.వి భాస్కరరావు, భారత నాస్తిక సమాజం ప్రతినిధి రాంప్రభు పాల్గొన్నారు.

ఎపికి ప్రత్యేక హోదా సాధనకు కూటమి ప్రభుత్వం కృషి చేయాలి

ప్రజాశక్తి- మాధరధార : విభజిత ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ముగిసిన అధ్యాయమని 16 వ ఆర్థిక సంఘం చైర్మన్ చెప్పడం విచారకరమని ఎపిసిసి ప్రధాన కార్యదర్శి మూల వెంకటరావు ఆవేదన వెలిబుచ్చారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదా ఇస్తామని పార్లమెంట్‌లో నిర్ణయం చేయగా, దాన్ని అమలు పరుస్తామని స్వయంగా ప్రధానమంత్రి హామీ ఇచ్చారన్నారు. దీంతో పదేళ్లకు పైగా నవ్యాంధ్ర ప్రజలు ప్రత్యేక హోదా కోసం ఎదురుచూస్తున్నారన్నారు. ఈనేపథ్యంలో 14వ ఆర్థిక సంఘం చైర్మన్ తమ పరిధిలోకి రాదని చేతులెత్తేయగా, ప్రస్తుతం 16వ ఆర్థికసంఘం చైర్మన్ ప్రత్యేకహోదా అంశం ముగిసిన అధ్యాయమనడం బాధాకరమన్నారు.

ప్రణాళికా సంఘం దద్దయినంత మాత్రాన ప్రభుత్వ విధానం మారదని, ఇది కేంద్ర ప్రభుత్వ పరిధిలోని అంశమన్నారు. నీతి అయోగ్‌తో నిమిత్తం లేకుండా రాష్ట్రంలో ప్రత్యేక పరిస్థితులను పరిగణలోకి తీసుకుని 16వ ఆర్థిక సంఘం ప్రత్యేకహోదా కోసం సిఫారసు చేయాలని డిమాండ్ చేశారు. ప్రత్యేకహోదా, విభజన హామీల అమలుకు రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తేవాలని, ముఖ్యంగా ప్రధాని మోడీకి వివరించి, సాధనకు గట్టిగా కృషిచేయాలన్నారు

వక్ఫ్ చట్ట సవరణపై ముస్లిముల భగ్గు!

- గాజువాకలో ఉవ్వెత్తున ఎగసిన భారీ ర్యాలీ
- కేంద్ర నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని నిరసన
- పాల్గొన్న ముస్లిం మహిళలు, వృద్ధులు, పిల్లలు
- సిపిఎం, వైసిపి, ప్రజాసంఘాల మద్దతు



గాజువాకలో నిరసన ర్యాలీ చేస్తున్న ముస్లిములు, సంఘీభావంగా పాల్గొన్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి -గాజువాక : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్ చట్ట సవరణను తక్షణమే రద్దు చేయాలని కోరుతూ, శుక్రవారం గాజువాకలో ముస్లిములు భారీ ఎత్తున ర్యాలీ చేపట్టారు. జిల్లాలో అన్ని మసీదు పరిధిలోని ముస్లిం యువకులు, వృద్ధులు, మహిళలు, చిన్నపిల్లలు ర్యాలీలో పాల్గొన్నారు. బ్యానర్లు, నల్ల ప్లకార్డులు పట్టుకుని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వక్ఫ్‌చట్ట సవరణ నిర్ణయాన్ని తక్షణం రద్దు చేయాలని నినదించారు. వక్ఫ్ చట్టసవరణ ఆందోళనతో గాజువాక రహదారులన్నీ ముస్లిం ఆందోళనకారులతో కిక్కిరిసిపోయాయి. భారీ ఎత్తున ప్రజలు పాల్గొని, నిరసన తెలిపారు.

బిసి రోడ్డులోని మసీదు నుంచి ప్రారంభమైన ర్యాలీ కణితి కాయగూరల మార్కెట్, వంటిల్లు, పాత గాజువాక, చిన గంట్యాడ జంక్షన్‌ల మీదుగాసాగి, అక్కడ యూటర్న్ తీసుకుని మరలా పాత గాజువాక, శ్రీకన్య థియేటర్ మీదుగా కొత్త గాజువాక జంక్షన్ వరకు సాగింది.. సుమారు నాలుగు గంటల సేపు వేలసంఖ్యలో ముస్లిములు రోడ్డుపైనే ర్యాలీ నిర్వహించి, కేంద్రప్రభుత్వానికి తమ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వక్ఫ్ చట్టసవరణను రద్దు చేసే లేక పోరాడుతాం, రాజ్యాంగం ముద్దు రా రాచరికం వద్దు , నీది కాదు నీది కాదు భారతదేశ మన అందరిదీ, రాజ్యాంగం వ్యతిరేక ఒక్క చట్టం మాకొద్దు, భారత రాజ్యాంగం కాపాడాలి, మతోన్మాదం నశించాలి అంటూ పెద్దఎత్తున నిరసన నినాదాలు చేశారు. మైనార్టీస్ యునైటెడ్ ఫ్రంట్ ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీలకి వేలాదిమంది ముస్లిములు పాల్గొన్నారు.

ముస్లిముల నిరసనకు సిపిఎం మద్దతు

వక్ఫ్ చట్ట సవరణకు వ్యతిరేకంగా ముస్లిములు చేపట్టిన నిరసన ర్యాలీకి సిపిఎం నాయకులు మద్దతు తెలిపారు. ర్యాలీ ప్రారంభం నుంచి చివరి వరకు సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం జగ్గు నాయుడు, గాజువాక జోన్ కార్యదర్శి ఎం రాంబాబు, కార్పొరేటర్ డాక్టర్ బి గంగారావు, నాయకులు బంగారం నాయుడు, కిరీటం, సంతోషం, ఏ లోకేశ్వరరావు తదితరులు ర్యాలీలో ముందు వరుసలో పాల్గొని ముస్లిములకు సంఘీభావం తెలిపారు

ఈ సందర్భంగా 'ప్రజాశక్తి' దినపత్రిక ముద్రించిన వక్ఫ్ ప్రత్యేక సంచికను ప్రజాశక్తి జనరల్ మేనేజర్ ఎం వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ప్రారంభం నుంచి ముగింపు వరకు ముస్లిముల ర్యాలీ . ప్రజాశక్తి తరపున జనరల్ మేనేజర్ ఎం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వైసిపి గాజువాక నియోజకవర్గ ఇన్‌ఛార్జి తిప్పల దేవన్‌రెడ్డి ర్యాలీ ప్రారంభంలో పాల్గొని మద్దతు ప్రకటించారు. తరతరాలుగా ఉన్న వక్ఫ్ చట్టాన్ని ముస్లిముల మనోభీష్టానికి, వారి మతనిబంధనలను కాలరాస్తూ ఎలా సవరిస్తారని ముస్లిం మతపెద్దలు, యువత ఆక్రోషించారు. పోలీసుల ఆంక్షలు నేపథ్యంలో ఎటువంటి ప్రసంగాలు లేకుండానే నిరనన ర్యాలీ కొనసాగించారు.

200వ రోజుకు రిలే దీక్షలు

విశాఖ పోర్టు ఆసుపత్రి ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా నిరసన



రోడ్డెక్కి నిరసన వ్యక్తం చేస్తున్న సిఐటియు నేతలు, పోర్టు కార్మికులు

ప్రజాశక్తి- సీతమ్మధార : విశాఖ పోర్టు గోల్డెన్‌జుబ్లీ ఆసుపత్రిని పిపిపి విధానంలో అభివృద్ధి పేరుతో ప్రయివేటుకు కట్టబెట్టాలన్న ప్రభుత్వం, యాజమాన్యం చర్యలను నిరసిస్తూ పోర్టు కార్మికులు, ఉద్యోగులు, పెన్షనర్లు చేస్తున్న ఆందోళన శుక్రవారం 200 రోజుకు చేరుకుంది. దీక్షలో సిఐటియు ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణ మాట్లాడుతూ పోర్టు ఆసుపత్రి ప్రైవేటీకరణపై రాష్ట్రంలో అధికారంలో ఉన్న టిడిపి జనసేన, బిజెపి కూటమి ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు. ఆసుపత్రి అభివృద్ధికి టెండర్లకు వచ్చిన వారిని అడ్డుకోవాలన్నారు. ఆసుపత్రి ప్రైవేటీకరణ నిర్ణయం అనైతికమన్నారు. కార్మికుల కృషితోనే అభివృద్ధి చెందిన పోర్టు ఆసుపత్రిని, ఇపుడు ప్రయివేటుకు ధారాదత్తం చేయడం ద్వారా కార్మికులు,వారి కుటుంబాల ఆరోగ్యంతో చెలగాటమాడడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా ప్రయివేటీ కరణ ఆలోచన మానుకోవాలని, పోర్టు నిధులతోనే ఆసుపత్రిని అభివృద్ధిచేసి, వైద్యులు, సిబ్బంది నియామకం, ఆధునిక వైద్యసౌకర్యాలను సమకూర్చి, అవసరమైన మందులు అందుబాటులో ఉంచి గోల్డెన్ జుబ్లీ ఆసుపత్రిలో వైద్యసేవలను మెరుగుపరచాలని కోరారు. ఆసుపత్రి ప్రయివేటీకరణపై ప్రభుత్వం వెనక్కు తగ్గకుంటేకార్మికులు, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలతో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు బి.జగన్, జె.సత్యనారయణ, గణేష్, నాయుడు , రాజగోపాల్ రాఘవులు, కే ఎస్ కుమార్ నర్సింగరావు శ్రీను ఎంవి శ్రీను పాల్గొన్నారు.

ప్రమాదభరిత విద్యుత్ వైర్లు తొలగించండి

సిపిఎం ఆధ్వర్యాన చిట్టివలస విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ధర్నా

ప్రజాశక్తి - తగరపువలస :జివిఎంసి 1,2 వార్డుల పరిధిలోని బాలాజీనగర్, యాతపేటల్లో పలు ఇళ్లకు అత్యంత సమీపంలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ వైర్లను తొలగించాలని సిపిఎం జోన్ కార్యదర్శి ఆర్‌ఎస్‌ఎన్ మూర్తి డిమాండ్ చేశారు. శుక్రవారం పార్టీ భీమిలి జోన్ కమిటీ ఆధ్వర్యంలో చిట్టివలస విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట స్థానికులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆర్‌ఎస్‌ఎన్ మూర్తి మాట్లాడుతూ, ఇళ్లపై వేలాడుతున్న విద్యుత్‌వైర్లను తొలగించాలని పలు దఫాలుగా స్తానిక మహిళలు సంబంధిత విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు.ఇప్పటికైనా స్పందించి ప్రాణాపాయ ప్రమాదాలు జరగకముందే ఆయా ఇళ్లపై వేలాడుతున్న విద్యుత్ వైర్లను తొలగించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రవ్వ నరసింగరావు, ఎస్ అప్పలనాయుడు, స్థానికులు రీసు నరసింగరావు, చిన్నారావు, రమణ, బంగారాజు, పలువురు మహిళలు పాల్గొన్నారు అనంతరం ఎపిఇపిడిసిఎల్ ఆపరేషన్స్ ఎఇఇ బి.రవికి వినతిపత్రం అందజేశారు



విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న మహిళలు

కర్మయోగి కోర్సులు పూర్తి చేయాలి


అవగాహన కలిగిస్తున్న డైట్ అధ్యాపకులు రవి

ప్రజాశక్తి-మధురవాడ : ప్రతి ఉద్యోగి కర్మయోగి ఆన్‌లైన్ కోర్సులను తప్పనిసరిగా పూర్తిచేయాలని చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, డైట్ అధ్యాపకుడు గొట్టేటి రవి అన్నారు. శుక్రవారం పాఠశాలలో ఉపాధ్యాయులందరికీ ఇంటిగ్రేటెడ్ గవర్నమెంట్ ఆన్‌లైన్ ట్రైనింగ్ పోర్టల్‌పై అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఉద్యోగికీ విధి నిర్వహణలో నైపుణ్యాన్ని పెంచే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక పోర్టల్‌ను ఏర్పాటుచేసి, ఆన్‌లైన్‌లో శిక్షణనిస్తోందని, అన్ని రంగాల ప్రభుత్వ ఉద్యోగులు దీన్ని వినియోగించుకొని సంబంధిత కోర్సుల ద్వారా పూర్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని కోరారు. ఈ పోర్టల్‌లో ప్రభుత్వ ఉద్యోగులందరి వివరాలు ఆయా డిపార్ట్‌మెంట్ల ద్వారా రిజిస్ట్రేషన్ చేశామని, ప్రతి ఉద్యోగి తమ రిజిస్టర్డ్ మొబైల్ నెంబర్, ఒటిపి ద్వారా లాగిన్ కావాలని తెలిపారు. కర్మయోగి పేరున ఆన్‌లైన్ కోర్సులో చేరే విధానాన్ని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఉపాధ్యాయులకు వివరించారు. తమ మొబైల్ ఫోన్లలో పోర్టల్‌లో లాగిన్ చేయించి, మొదటి కోర్సు 'కోడ్ ఆఫ్ కాండక్ట్ ఫర్ గవర్నమెంట్ ఎంప్లాయిస్' ను ప్రారంభించారు.

నేటి నుంచి లడ్డూ విక్రయాలు

ప్రజాశక్తి-మధురవాడ : రుషికొండలోని మహాలక్ష్మీ గోదాదేవి సహిత వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం నుంచి లడ్డూ విక్రయాలు తిరిగి ప్రారంభం కానున్నాయని దేవస్థానం ఎఇఒ జగన్మోహనాచార్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల వైఎస్ఆర్ జిల్లాలోని ఒంటిమిట్ట ఆలయంలో సీతారాముల కల్యాణానికి శ్రీవారి లడ్డూలు తరలించడంతో ఇక్కడ తాత్కాలికంగా విక్రయాలు నిలిపి వేశామన్నారు. శనివారం నుంచి యథావిధిగా విక్రయకేంద్రంలో లడ్డూలు అందుబాటులో ఉంటాయని, భక్తులు గమనించాలని కోరారు.

ఉపాధి హామీ వేతన బకాయిలపై నిరసనలు

ప్రజాశక్తి- విలేకర్ల యంత్రాంగం

జిల్లాలో ఉపాధి హామీ కూలీలకు బకాయి పడిన రూ.80 కోట్లు వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని కోరుతూ సిఐటియు, ప్రజా సంఘాల ఆధ్వర్యాన పలు చోట్ల శుక్రవారం నిరసన కార్యక్రమాలు చేపట్టారు.

అచ్యుతాపురం : ఉపాధి హామీ కూలీలకు బకాయి వేతనాలు తక్షణమే చెల్లించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ రాము ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని కొండకర్ల గ్రామంలో ఉపాధి పనులు చేస్తున్న చెరువు ప్రాంతాన్ని శుక్రవారం సిఐటియు నాయకులు సందర్శించి కూలీలతో మాట్లాడారు. వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఏడు వారాలు నుండి కూలి డబ్బులు చెల్లించకపోవడంపై కూలీలు పెద్ద పెట్టున నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ అచ్చుతాపురం మండలంలో ఉపాధి కూలీలకు సుమారు కోటి రూపాయల వరకు ప్రభుత్వం చెల్లించాల్సి ఉందని తెలిపారు. పని ప్రదేశాల్లో టెంట్లు, మంచినీరు, మజ్జిగ, మెడికల్ కిట్లు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

కె.కోటపాడు : మండలంలోని గొండుపాలెంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న ప్రదేశంలో వేతన బకాయిలు చెల్లించాలని కోరుతూ కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్ర దేవుడు ఆధ్వర్యాన కూలీలు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా దేముడు మాట్లాడుతూ నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటుతుంటే ఈ ఏడాది అదనంగా రూ.7 పెంచి ప్రభుత్వం పండగ చేసుకోమనడం విడ్డూరంగా ఉందన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా రోజు కూలి రూ.600 ఇవ్వాలని, పనిముట్లు, వేసవి అలవెన్స్ చెల్లించాలని కోరారు.

బుచ్చయ్యపేట : మండలంలో ఉపాధి హామీ కూలీలకు 13 వారాలు వేతన బకాయిలు చెల్లించాలని కోరుతూ మండలంలోని పోలేపల్లి గ్రామంలో ఉపాధి హామీ కూలీలు పని ప్రదేశంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఏపి రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎస్వీ నాయుడు మాట్లాడుతూ 13 వారాల నుంచి కూలి డబ్బులు చెల్లించకపోతే వారు ఎలా బతకాలని ప్రశ్నించారు. సంబంధించిన శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి 13 వారాలు బకాయిలు చెల్లించాలని కోరారు.



అచ్యుతాపురం మండలం కొండకర్లలో నినాదాలు చేస్తున్న ఉపాధి కూలీలు



బుచ్చయ్యపేట మండలం పోలేపల్లిలో..

తక్షణమే చెల్లించాలి : సిపిఎం నేత లోకనాథం

ప్రజాశక్తి-నక్కపల్లి : నక్కపల్లి మండలంలో ఉపాధి కూలీలకు పెండింగ్‌లో ఉన్న 4 కోట్ల రూపాయలు, జిల్లాలో ఉన్న 80 కోట్లు రూపాయల బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం డిమాండ్ చేశారు. మండలంలోని డిఎల్.పురం, తమ్మయ్యపేట గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనుల వద్దకు శుక్రవారం సిపిఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, మండల కార్యదర్శి ఎం.రాజేష్‌లతో కలిసి లోకనాథం వెళ్లి ఉపాధి కూలీలతో మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కె.లోకనాథం మాట్లాడుతూ, వారాల తరబడి కూలీలకు బకాయిలు చెల్లించకపోతే కుటుంబాలను ఎలా పోషించుకుంటారని ప్రశ్నించారు. ఒకవైపు పెరిగిన ధరలతో సతమతమవుతుంటే, సకాలంలో కూలీలకు వేతనాలు చెల్లించకపోతే ఎలా జీవిస్తారని ప్రశ్నించారు. ప్రభుత్వానికి కూలీల పట్ల కనీసం జాలి, దయ లేకుండా ఉందన్నారు. నెలల తరబడి బకాయిలు పెట్టి కూలీల కుటుంబాలను పస్తులతో ఉంచుతున్నారని, చేసిన పనికి 15 రోజుల్లోగా వేతనాలు చెల్లించాలని చట్టం ఉన్నా దాన్ని అమలు చేయకుండా చట్టాన్ని ఉల్లంఘించి కూలీల కడుపు మాడుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేలకు, అధికారులకు నెల మొదటి రోజే వేతనాలు చెల్లిస్తున్నారని, ఉపాధి కూలీలకు మాత్రం సకాలంలో పేమెంట్లు చేయలేదని ఇది సరైన పద్ధతి కాదన్నారు. వెంటనే బకాయి వేతనాలు చెల్లించకపోతే ఎంపిడిఓ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిఎల్.పురం సర్పంచ్ కిల్లాడ రామకృష్ణ, బొబ్బిలి, దేవుడు, రమణ, బాబ్జీ, చిరంజీవి, తాతాజీ తదితరులు పాల్గొన్నారు.



కూలీలనుద్దేశించి మాట్లాడుతున్న సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు లోకనాథం



శిలువ మోస్తున్న దృశ్యం

భక్తి శ్రద్ధలతో గుడ్ ఫ్రైడే

ప్రజాశక్తి-చోడవరం : గుడ్ ఫ్రైడే సందర్భంగా మండలంలో పలు చర్చిల్లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. గాంధీ గ్రామం ఆర్సిఎంసి చర్చిలో యేసు శిలువ మోస్తున్న ప్రక్రియను వేషధారులచే పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చిలో ఫ్రైడే విశిష్టతను వివరించారు. శ్రమ దినాలు దీక్షను పాటిస్తున్న క్రైస్తవ సోదరులు శుక్రవారం విరమించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు ప్రసాద్, బాలస్వామి, తపో తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడుకు రత్నాకర్ అభినందనలు

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ యంగ్ గ్లోబల్ లీడర్‌గా ఎంపికైన కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడుకు టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. వివిధ రంగాలలో ప్రతిభ కనబరిచిన 40 సంవత్సరాల లోపు గల వ్యక్తులను యంగ్ గ్లోబల్ లీడర్స్‌గా వరల్డ్ ఎకనామిక్ ఫోరం గుర్తిస్తుందని చెప్పారు.

టిడిపి కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని గొర్లివానిపాలెం గ్రామంలో తెలుగుదేశం పార్టీ పరవాడ మండల నూతన కార్యాలయాన్ని శుక్రవారం ప్రారంభించారు. టిడిపి పెందుర్తి నియోజకవర్గం ఇన్‌ఛార్జి ఏపి రాష్ట్ర ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్ గండి బాబ్జి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా టిడిపి జిల్లా అధ్యక్షులు బత్తుల తాతయ్యబాబు మాట్లాడుతూ మండలంలో గ్రామ కమిటీలు మండల కమిటీలు, కేఎస్ఎస్‌లు సమర్థవంతమైన పని చేసే నాయకులకు కృషి చేయాలని కోరారు. ప్రతి బుధవారం నియోజకవర్గంలో ప్రజా దర్బార్ జరుగుతుందని, కార్యకర్తలు ప్రజలు నాయకులు తమ సమస్యలను తెలియజేయాలని కోరారు. నియోజకవర్గం ఇన్‌ఛార్జి గండి బాబ్జి మాట్లాడుతూ కార్యకర్తల అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గం పరిశీలకులు నోడగల కృష్ణ, ఉత్తరం ఇన్‌ఛార్జి వెల్లంకి భరత్, మాజీ జడ్పిటిసి పైల జగన్నాధరావు, మాజీ ఎంపిపి మాసవరపు అప్పలనాయుడు, టిడిపి మండల అధ్యక్షులు వియ్యపు చిన్నా, నాయకులు రెడ్డి నారాయణరావు, కాళ్ల వరలక్ష్మి, కన్నూరు దేవి వెంకటరమణ, గొర్లి కనకారావు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

తానాం సర్పంచ్ కన్నూరు వివాహవార్షికోత్సవం

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని తానాం గ్రామపంచాయతీ సర్పంచ్ కన్నూరు దేవి వెంకటరమణ వివాహ వార్షికోత్సవం టిడిపి మండల కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. నాయకులు సమక్షంలో కేక్ కట్ చేశారు. వారిని విశాఖ ఎంపీ శ్రీభరత్ శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో టిడిపి నేతలు గండి బాబ్జి, పైల జగన్నాధరావు, మాసవరపు అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.



కన్నూరు దేవి వెంకటరమణ దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

ఎస్ఎఫ్ఐ నుండి ఎం.రమణ, ఎస్ఎన్.రమణ తొలగింపు

ప్రజాశక్తి-అనకాపల్లి : భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) నుండి జిల్లా కార్యదర్శి ఎం.రమణ, మాజీ కార్యదర్శి సుర్ల నాగ రమణలను తొలగించినట్లు ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎల్జె.నాయుడు తెలిపారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సమావేశం ఎం.బాలాజీ అధ్యక్షతన శుక్రవారం స్థానిక కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా నాయుడు మాట్లాడుతూ రమణ, నాగరమణలు ఎస్ఎఫ్ఐ పద్ధతులకు భిన్నంగా, అనైతిక చర్యలకు పాల్పడిన తెలిపారు. ఎస్ఎఫ్ఐ విద్యార్థుల సమస్యలపై సమరశీలంగా పోరాడుతుందని, నీతికి నిజాయితీకి, నైతిక విలువలకు కట్టుబడి ఉంటుందని పేర్కొన్నారు. ఎస్ఎఫ్ఐ పద్ధతులకు భిన్నంగా ఎవరు వ్యవహరించినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు విజయ్, దివాకర్, కుమారి, రమణ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న నూకాంబిక జాతర మహోత్సవం

ప్రజాశక్తి-అనకాపల్లి : శ్రీనూకంబిక అమ్మవారి జాతర మహోత్సవం కొనసాగుతోంది. ఇందులో భాగంగా శుక్రవారం నూకాంబిక కోలాట సంఘం, దువ్వాడ జడ్డు రజిత, శ్రీగౌరీ బాల గణపతి కోలాటం మూలపేట గొర్లె రాధిక, శ్రీ నూకంబిక భక్తి రంజని, గణేష్ శ్రీలలిత, విశాఖపట్నం వారి ఆర్కెస్ట్రా, మాతృశ్రీ కూచిపూడి నృత్య అకాడమీ, గాజువాక, శ్రీరమ్య రేషిత శ్రీ, చిన్నారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. డాక్టర్ గ్రంధి శేష కుమార్, కోరుకొండ శరత్ కుమార్, ఈనాడు భాను, రాపేటి రామ్ కుమార్, సమ్మంగి కుమారి ముఖ్య అతిథులుగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం కళాకారులకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా ప్రశంస పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో నూకాంబికా దేవస్థానం చైర్మన్ పీలా నాగ శ్రీను, రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ విల్లూరి హరికృష్ణ, నిర్వాహకులు తిమ్మాపాత్రుని చక్రవర్తి, సకల గోవింద్, గండేపల్లి మురళి పాల్గొన్నారు.

పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు చర్యలు

- జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్‌పి తుహిన్ సిన్హా

- పారిశ్రామిక భద్రతపై సమీక్షా సమావేశం



మాట్లాడుతున్న కలెక్టర్ విజయ కృష్ణన్

ప్రజాశక్తి-పరవాడ : అనకాపల్లి జిల్లా పారిశ్రామిక ప్రాంతాల్లో ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్‌పి తుహిన్ సిన్హా అన్నారు. పారిశ్రామిక ప్రాంతాలు ముఖ్యంగా పరవాడ, అచ్యుతాపురం, రాంబిల్లిలో గల ఫార్మా కంపెనీల్లో జరిగే ప్రమాదాల నివారణకు భద్రతా చర్యలపై పరవాడ ఏకోనో హోటల్‌లో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాలోని 164 ఫార్మా, ఇతర పరిశ్రమలకు చెందిన చైర్మన్లు, మేనేజింగ్ డైరెక్టర్లు, డైరెక్టర్లు, ప్లాంట్ నిర్వహణ అధికారులు, భద్రత అధికారులు, హెచ్ఆర్ మేనేజర్లు పాల్గొన్నారు. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా నేతృత్వంలో జరిగిన సమావేశంలో కలెక్టర్ విజయ కృష్ణన్ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. గత అనుభవాల నుండి పాఠాలు నేర్చుకొని భవిష్యత్‌లో ప్రమాదాలు జరుగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కార్మికుల్లో అవగాహన పెంచేందుకు తగిన శిక్షణ ఇవ్వాలని, అత్యవసర పరిస్థితుల్లో సమర్థవంతంగా స్పందించే వ్యవస్థలను అభివృద్ధి చేయాలి సూచించారు. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడుతూ, పరిశ్రమలు యువతకు ఉపాధి కల్పిస్తున్నాయని, జిల్లా అభివృద్ధికి తోడ్పడుతున్నాయని చెప్పారు. పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలను పాటించడం ప్రతి పరిశ్రమ యొక్క బాధ్యత అని పేర్కొన్నారు. పరవాడ డిఎస్పీ విష్ణు స్వరూప్ మాట్లాడుతూ ఇటీవల జరిగిన కొన్ని పారిశ్రామిక ప్రమాదాలను విశ్లేషించి వాటి కారణాలను వివరించి భవిష్యత్తులో జరగకుండా ఉండడానికి తగు చర్యలు సూచించారు. ఈ సమావేశంలో జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ జె.శివశంకర్ రెడ్డి, బాయిలర్ ఇన్స్పెక్టర్ కె.వీరభద్రరావు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఈఈ పివి.ముకుందరావు, జిల్లా ఫైర్ ఆఫీసర్ ఆర్‌వి.రమణ, డ్రగ్ ఇన్స్పెక్టర్ వి.అభిప్రియ, లేబర్ డిపార్ట్‌మెంట్ ఇంచార్జ్ అధికారి కె.వసంతరావు, పరవాడ, అచ్యుతాపురం, రాంబిల్లి సిఐలు ఆర్.మల్లికార్జునరావు, ఎన్.గణేష్, సిహెచ్. నరసింహారావు, ఎస్సైలు కృష్ణారావు, రామారావు, మహాలక్ష్మి, పారిశ్రామిక భద్రతా అధికారులు, స్థానిక పోలీసులు, పరిశ్రమల సేఫ్టీ ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.

రసకందాయంలో యలమంచిలి రాజకీయం

- ఈ నెల 22న చైర్‌పర్సన్ బలపరీక్ష
- 8 మంది కౌన్సిలర్లతో తమిళనాడు టూర్
- అవిశ్వాసం నెగ్గాలంటే 17 మంది హాజరు తప్పనిసరి
- హాజరుపై అనుమానాలు

ప్రజాశక్తి - యలమంచిలి

యలమంచిలి మున్సిపాలిటీ రాజకీయం రసకందాయంలో పడింది. చైర్‌పర్సన్ బలపరీక్ష తేదీ (22 ఏప్రిల్) దగ్గర పడుతుండడంతో ఏం జరుగుతుందోనని పట్టణ ప్రజలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. చైర్‌పర్సన్ అనుహ్యంగా వైసిపీ కౌన్సిలర్లు 8 మందిని ఊరు దాటించి క్యాంపు రాజకీయాలకు తెర లేపినట్లు బోగట్టా. వీరిని తమిళనాడులో వేసవి విడిది ఊటీ, కొడైకెనాల్‌లో ఉంచినట్లు విశ్వసనీయ సమాచారం.

ఈనెల 22వ తేదీన జరగనున్న అవిశ్వాస తీర్మానం సమావేశానికి నర్సీపట్నం రెవెన్యూ డివిజనల్ అధికారి వివి.రమణ రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తూ అధ్యక్షత వహిస్తారు. ఈ అవిశ్వాస తీర్మానానికి 25 మంది సభ్యులు, ఎమ్మెల్యే ఓటుతో కలిపి 26 మందికి గాను టూ థర్డ్ (2/3) మెజార్టీ సభ్యులు అంటే 17 మంది తప్పనిసరిగా హాజరైతేనే కోరం సరిపోతుంది. కోరం లేకపోతే సమావేశం రద్దవుతుంది. దీనికి చైర్‌పర్సన్ రమాకుమారి హాజరు కావచ్చు, కాకపోవచ్చునని కమిషనర్ ప్రసాదరాజు తెలిపారు.

చైర్‌పర్సన్‌కు అనుకూలంగా ఉండే వైసిపికి చెందిన కౌన్సిలర్లను ఏప్రిల్ మొదటి వారంలోనే తమిళనాడు ఊటీకి కార్లలో తరలించినట్లు తెలిసింది. అనంతరం వారి జీవిత భాగస్వాముల్ని కూడా అక్కడికి తరలించారని సమాచారం ఈ క్యాంపు రాజకీయాలను స్వయంగా విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనందకుమార్ ఆధ్వర్యంలో జరిగినట్లు కొందరు కౌన్సిలర్లు తెలిపారు. క్యాంపులోని కౌన్సిలర్ల బాగోగులు చూసుకోవడానికి మాజీ జెడ్‌పిటిసి ఆడారి శ్రీధర్, సీనియర్ అనుచరుడు వెంకట్‌లను నియమించినట్లు తెలిసింది. కౌన్సిలర్లు శుక్రవారం రామేశ్వరం కూడా దర్శించినట్లు తెలిసింది. తమిళనాడు క్యాంపులో కౌన్సిలర్లలో 2వ వార్డు కౌన్సిలర్ పందూరు హరనాథ్, 6వ వార్డు ఆడారి పార్వతి, 7వ వార్డు కట్టమూరు సుజాత, 10వ వార్డు ముజేటి అప్పలకొండ, 16వ వార్డు మిచర్ల కిరణ్, 18వ వార్డు రాయి భార్గవి, 24వ వార్డు సుంకర మరిణేశ్వరరావు, 8వ వార్డు ఇండిపెండెంట్ సీర సాయిలక్ష్మిప్రసన్న, ఉన్నట్లు చెప్పుకుంటున్నారు. వీరందరికీ ఆర్థిక ప్యాకేజీ కూడా ఇస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.



వీరు కాక వైసిపికి చెందిన 1వ వార్డు కౌన్సిలర్ కర్రి లక్ష్మి ఇటీవల తెలుగుదేశం కండువా కప్పుకున్నారు. 23వ వార్డు కౌన్సిలర్ మజ్జి రామకృష్ణ తెలుగుదేశం పార్టీ వ్యక్తి. చైర్ పర్సన్ పిళ్లా రమాకుమారి, ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్‌తో కలిసి 12 మంది సభ్యులు అవిశ్వాస తీర్మానానికి వ్యతిరేకంగా ఉన్నారు. మిగిలిన 14 మంది సభ్యుల్లో కూడా మరికొంత మంది సమావేశానికి డుమ్మా కొట్టే పరిస్థితి ఏర్పడిందని స్థానిక పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. అవిశ్వాస తీర్మానానికి డుమ్మా కొట్టే కౌన్సిలర్లకు ఆర్థిక పేకేజీ కూడా సిద్ధం చేసినట్లు విశ్వసనీయ సమాచారం.

ఎస్సీ వర్గీకరణ ఆర్డినెన్స్‌పై హర్షం

ప్రజాశక్తి- సబ్బవరం : ఎస్సీ వర్గీకరణ అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఆర్డినెన్స్ ఆమోదం పొందడం పట్ల ఎంఆర్‌పిఎస్ జిల్లా మాజీ అధ్యక్షులు గొటివాడ సామ్రాట్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. సామ్రాట్ కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంద కృష్ణమాదిక 30 ఏళ్ళ సుదీర్ఘ పోరాటం ద్వారా విజయం సాధించారని తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు యలక మల్లిబాబు, నాయకులు ఇందుగుబిల్లి గోపీ, కొల్లి చిన్న అప్పారావు, కట్టమూరు మంగరాజు, కండెల వెంకటరావు మాస్టారు, కాకినాడ కనకేశ్వరరావు, గంపల చినరాజు, మండేటి రాజబాబు, మారేడు పూడి సతీష్, చెవ్వేటి అప్పారావు చెవ్వేటి రమేష్, అప్పారావు ఠాగూర్, తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులకు దుప్పట్ల పంపిణీ

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని కృష్ణంపాలెం గ్రామంలో హెరిటేజ్ డెయిరీ ఆధ్వర్యంలో శుక్రవారం పాడి రైతులకు డెయిరీ జోనల్ మేనేజర్ వి.దివాకర్‌రావు చేతులమీదుగా దుప్పట్లు పంపిణీ చేశారు. అలాగే ఎంపిక చేసిన లాలం రాజబాబు, రెడ్డి బాబు, లాలం త్రిమూర్తులును సన్మానించారు. 45 పాడిపశువులకు వైద్య చికిత్సలు చేసి రైతులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డెయిరీ రీజనల్ మేనేజర్ పి తులసి నాయుడు, పశు వైద్యాధికారి డాక్టర్ హేమచంద్రరావు, డెయిరీ మేనేజర్ కూండ్రపు శేషు, ఆర్.సత్తిబాబు, వెటర్నరీ అసిస్టెంట్ సిహెచ్.రాము, ఆర్.శంకర్రావు, ఆర్.గణేష్, ఆర్.ఎర్రినాయుడు, రాజబాబు, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు స్కూల్ బ్యాగ్స్ పంపిణీ

ప్రజాశక్తి-పరవాడ : డాక్టర్ బిఆర్.అంబేద్కర్ జయంతి సందర్భంగా ఎన్టీపీసీ సింహాద్రి ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎన్టిపిసి సిఎస్ఆర్ నిధులతో శుక్రవారం మెట్టపాలెం గర్ల్స్ హాస్టల్ విద్యార్థినులకు స్కూల్ బ్యాగ్స్, వాటర్ బాటిల్స్ పంపిణీ పంపిణీ చేశారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా నిర్వహించిన వివిధ రకాల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ఎన్‌టిపిసి హెచ్‌ఓ హెచ్ఆర్ బిబి పాత్ర, డీజీఎం హెచ్ఆర్ అనిత్‌కుమార్, ఎన్టీపీసీ సింహాద్రి ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు జి చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి అజ్మీరా వేంకటేశ్వరరావు, అసోసియేషన్ సభ్యులు గుంటూరు. శ్రీనివాస్, గూడ సుధాకర్, టి.రాజలింగం, కె నారాయణరావు, కె.తాతబాబు, జె చిట్టిబాబు, ఎస్.ప్రసాద్, కె.మహేష్, చినబ్బాయి, అధియ్య, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

జాతీయ బాలల పురస్కారాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-అనకాపల్లి : కేంద్ర ప్రభుత్వ స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల్ పురస్కారాలను ప్రదానం చేసేందుకు 5-18 ఏళ్ళు వయస్సు గల బాలల నుండి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఏపి రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సామాజిక సేవ, సాంకేతిక పరిజ్ఞానం, విద్య, ధైర్యసాహసాలు, పర్యావరణం, క్రీడలు, కళలు, సంగీతం, నృత్యం, పెయింటింగ్, నూతన ఆవిష్కరణలు, నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు తదితర వాటిలో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభను కనబరుస్తున్న భారత సంతతికి చెందిన బాలలు దీనికి అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు ఈ ఏడాది జులై 31 తేదీ లోపుగా వెబ్సైట్ http://awards.gov.in ద్వారా దరఖాస్తులను ఆన్లైన్ ద్వారా పంపించాలని సూచించారు.

ఉపాధి హామీ కూలీలకు డ్రింకల పంపిణీ

ప్రజాశక్తి-కశింకోట : మండలంలో అచ్చెర్ల గ్రామ పంచాయతీలో ఉపాధి హామీ పనులను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కూలీలకు కూటమిన నాయకులు డ్రింకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి గ్రామ అధ్యక్షులు నైనముశెట్టి రమణరావు, కూటమి నాయకులు నిమ్మదల సన్యాసినాయుడు, దొడ్డి నగేశ్వరరావు, గుడిబండ జాన్, బి.శ్రీనివాసరావు, నైనముశెట్టి నాగేశ్వరరావు, సూరి అప్పలరాజు, నాగేశ్వరరావు (బుజ్జి) కూలీలు పాల్గొన్నారు.


కూలీలకు డ్రింగ్‌లు అందిస్తున్న కూటమి నాయకులు

సిపిఎం నేత మళ్ల సత్యనారాయణకు ఘన నివాళి


మళ్ల సత్యనారాయణ చిత్ర పటానికి పూలమాల వేస్తున్న లోకనాథం తదితరులు

ప్రజాశక్తి- అనకాపల్లి

సిపిఎం సీనియర్ నాయకులు, కార్మిక నేత కామ్రేడ్ మళ్ల సత్యనారాయణ ఆశయాలను కార్యకర్తలు ముందుకు తీసుకెళ్లాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో మళ్ల సత్యనారాయణ రెండవ వర్ధంతి కార్యక్రమం గురువారం మండల కన్వీనర్ గంటా శ్రీరామ్ అధ్యక్షతన జరిగింది. ముందుగా సత్యనారాయణ చిత్రపటానికి కె.లోకనాథం, జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు, సత్యనారాయణ కుటుంబ సభ్యులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ మళ్ళ సత్యనారాయణ విద్యార్థి ఉద్యమం నుండి వామపక్ష భావాలతో పనిచేశారని తెలిపారు. అనకాపల్లిలో మున్సిపల్, ముఠా కార్మిక సంఘాలను, బెల్లం మార్కెట్ కొలగార్లు, కళాసీ సంఘాలను నిర్మించి వారి సమస్యలపై అనేక పోరాటాలు నిర్వహించారని గుర్తు చేశారు. నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను హరిస్తున్నాయని, వాటికి వ్యతిరేకంగా పోరాటాలు చేయడమే సత్యనారాయణకు మనమిచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు, మళ్ల సత్యనారాయణ సోదరుడు మళ్ళ జగన్మోహన్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకర్రావు, ఎల్ఐసి రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు మళ్ల చంద్రశేఖరరావు తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అల్లు రాజు, బి.ఉమామహేశ్వరరావు, నాయకులు కె.తెల్లయ్యబాబు, కె.ఈశ్వరరావు, ముఠా కార్మిక సంఘం నాయకులు బీశెట్టి అప్పారావు, మంద రాము, టి.సురేష్, కాపుశెట్టి అప్పారావు, ముఠా కళాసీలు తదితరులు పాల్గొన్నారు.


రోడ్డుకు అడ్డంగా విరిగిపడిన చెట్టును తొలగిస్తున్న దృశ్యం

ఈదురుగాలులతో విరిగిన చెట్టు

- రోడ్డుకు అడ్డంగా పడడంతో రాకపోకలకు అంతరాయం

ప్రజాశక్తి-కె.కోటపాడు : ఈదురుగాలుల కారణంగా మండలంలోని పలు గ్రామాలలో శుక్రవారం చెట్లు విరిగిపడ్డాయి. అరటి, కొబ్బరి, ఇతర రకాల చెట్లు తోటలు నేలమట్టమయ్యాయి. కె.కోటపాడు నుంచి పినగాడి వెళ్లి రోడ్డులో కింతాడ శివారు రామచంద్రపురంలో గల మెడికల్ షాప్ వద్ద ఒక వృక్షం రోడ్డుకు అడ్డంగా పడడంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. సుమారు అరగంటల పాటు ఈ రోడ్డుపై రాకపోకలు ఆగిపోయాయి. స్థానికులు ఆ చెట్టును తొలగించడంతో వాహదారులు రాకపోకలు సాగించారు.

టిడిపి సభ్యత్వ కార్డుల పంపిణీ

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : తెలుగుదేశం పార్టీ సభ్యత్వ కార్డులను మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగ జగదీశ్వరరావు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి సభ్యత్వ కార్డులు ఉన్న వారు ప్రమాదంలో చనిపోతే రూ.5లక్షలు బీమా వర్తిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సదరం శివ అప్పారావు, పెంటకోట శివరాం, బొడ్డేడ ఈశ్వర్ అయ్యప్ప, కొణతాల బాబురావు, కొణతాల గణేష్, కాండ్రేగుల శ్రావణ్ పాల్గొన్నారు.

కశింకోట : మండలంలోని బయ్యవరంలో టిడిపి సభ్యత్వ కార్డులను శుక్రవారం పంపిణీ చేశారు. టిడిపి సభ్యత్వం ఉన్న వారు ప్రమాదంలో అంగవైకల్యం జరిగితే రూ.2.50 లక్షలు బీమా వర్తిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమం టిడిపి యూనిట్ ఇన్‌ఛార్జి ఎస్‌కె.బాబర్, బూత్ ఇన్‌ఛార్జి సిహెచ్.ప్రసాద్, తెలుగు మహిళ అధ్యక్షురాలు సీరం వెంకటలక్ష్మి, గుమ్మాల మాణిక్యం, చోడే సూర్య అప్పారావు, బరుకు గంగరాజు, ఎస్ గోవింద, కెల్లంపల్లి శ్రీనివాస్, గొల్లవిల్లి భవాని పాల్గొన్నారు.


అనకాపల్లిలో సభ్యత్వ కార్డులు అందిస్తున్న నాగజగదీష్

చెరువులో పూడికతీత పనులు ప్రారంభం

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలో ఆవరాజము, మడుతూరు, దోసూరు గ్రామాలలో నీటి వనరుల పునరుద్ధరణ పథకంలో భాగంగా ఏషియన్ పెయింట్స్ అంబుజా ఫౌండేషన్ ఆర్థిక సహాయంతో చెరువుల్లో పూడిక తీత పనులను ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ కుమార్ శుక్రవారం ప్రారంభించారు. ఆవరాజాములో ఊరచెరువు పనులకు రూ.8.70లక్షలు, మడుతురులో రూ.11.43లక్షలు, దోసూరులో బాబుగారి చెరువు పనులకు రూ.11.72 లక్షలు ఏషియన్ పెయింట్స్ సిఎస్ఆర్ నిధులు మంజూరు చేసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చెరువుల్లో పూడిక తీస్తే వర్షపు నీటిని ఆదా చేయవచ్చని చెప్పారు. తద్వారా భూగర్భ జలాలు పెరుగుతాయని చెప్పారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి రాజాన రమేష్ కుమార్, గ్రామ సర్పంచులు నర్మల సుజాత, మోటూరు సంజీవ్, వియపు నానాజీ, మోటూరు శ్రీవేణి, సిరసపల్లి రమణ, తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి బాక్సింగ్ పోటీలకు సంస్కృతి విద్యార్థి

ప్రజాశక్తి-పరవాడ : ఢిల్లీలో ఈ నెల 19 నుండి జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీల్లో స్థానిక సంస్కృతి గోబల్ స్కూల్ విద్యార్థి ఎన్. ఎమ్. హరిన్ పాల్గొంటున్నట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్. సీతాలక్ష్మి శుక్రవారం తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మచిలీపట్నంలో 2024 అక్టోబర్ 27న జరిగిన రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలలో హరిన్ బంగారు పతకం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. క్రీడాకారుడు హరిన్‌ను కోచ్ అమర్నాథ్, అన్నపూర్ణలను స్కూల్ చైర్మన్ పి.సూర్యనారాయణ రెడ్డి, సీఈఓ కె.నిశాంత్ అభినందించారు.

24 నుంచి కరాటే శిక్షణా తరగతులు

ప్రజాశక్తి-దేవరాపల్లి : దేవరాపల్లి ఉషోదయ స్కూల్ ప్రాంగణంలో ఈనెల 24 నుండి జూన్ 13వ తేదీ వరకు ప్రతిరోజు ఉదయం 6.30 నుంచి 7.30 గంటల వరకు ఉచితంగా కరాటే శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు సీనియర్ కరాటే కోచ్ గెద్దం నగేష్ తెలిపారు. ప్రస్తుత కాలంలో ఆడపిల్లలకు కరాటే నేర్పించాల్సిన అవసరం తల్లిదండ్రులపై ఉందన్నారు. కరాటే నేర్చుకునేందుకు ఆసక్తిగల విద్యార్థినీ, విద్యార్థులు మరిన్ని వివరాలకు 9542293555, 9182856530 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

పేరు మార్చారు సరే..రోడ్డు సౌకర్యమేదీ?

- జగనన్న కాలనీలకు పిఎంఎవై, ఎన్‌టిఆర్ నగర్‌గా మార్పు
- రహదారి సౌకర్యం లేక నూతన గృహాలకు తాళాలు వేసిన లబ్ధిదారులు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం


బురదగా ఉన్న కాలనీకి వెళ్లే రహదారి

ప్రజాశక్తి-కోటవురట్ల:గత ప్రభుత్వంలో మండలంలోనే అతిపెద్ద జగనన్న కాలనీ పేరుతో స్థానిక పెట్రోల్ బంకు సమీపంలో 167 మంది లబ్ధిదారులను ఎంపిక చేసి 157 మంది లబ్ధిదారులకు పట్టాలు అందజేశారు. ఈ కాలనీకి వెళ్లేందుకు నాటి ప్రభుత్వ అధికారులు కనీసం రహదారికి స్థలమైనా లేకుండా నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేశారు

. ప్రస్తుత ప్రభుత్వం నాటి జగనన్న కాలనీలకు పీఎం ఏవై, ఎన్టీఆర్ నగర్‌గా కూటమి ప్రభుత్వం పేరు మార్చింది. ప్రభుత్వం పేరు మార్చడంతో కాలనీకి రోడ్డు నిర్మాణం చేపడతారని సంతోష పడ్డారు. కానీ, ఆ ఊసే మరిచిసినట్లుంది కూటమి ప్రభుత్వం.

ఇక్కడ మంజూరైన 157 ఇళ్లకు గాను దాదాపు 67 వరకు ఇల్లు పూర్తికాగా 48 బేస్మెంట్ లెవెల్, రూఫులెవలు 7, ఆర్ సి 2, బిబిఎల్ 35 స్థాయిలో ఉన్నాయి. అయితే నిర్మాణం పూర్తయినా 67 ఇళ్లకు గాను తప్పనిసరి పరిస్థితుల్లో పది మంది మాత్రమే నివాస ముంటున్నారు, మిగతా లబ్ధిదారులు గృహప్రవేశం చేసుకొని ఇళ్లకు తాళాలు వేసి వెళ్లిపోయారు. కాలనీ వరకు వెళ్లేందుకు సక్రమంగా రహదారి సైతం ప్రభుత్వం ఏర్పాటు చేయకుండా నిర్మాణం చేపట్టడం పట్ల, అదేవిధంగా కాలనీలో రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో నిర్మాణాలను పూర్తయిన నివాసం ఉండలేక పోతున్నారు. రాత్రి సమయంలో కాలనీకి వెళ్ళేందుకు నానా అవస్థలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. వర్షం వస్తే కాలనీ వద్ద వీధి రోడ్లు వరద భయంగా దర్శనమిచ్చి కనీసం నడిచి వెళ్లేందుకు కూడా అవకాశం లేక అవస్థలు పడుతున్నారు.

కాలనీ సమీపంలో ఒక దాత 137 మీటర్ల పొడవుతో, 4.5 మీటర్ల వెడల్పుతో భూమిని సాగి ఆంజనేయ వర్మ, గోపాల కుమార్ వర్మ, రహదారికి భూమి విరాళంగా ఇచ్చేందుకు ముందుకు వచ్చారు. సదరు భూమి ఇనాం భూమితో ఉండడంతో పంచాయతీకి రిజిస్ట్రేషన్ చేయడానికి కుదరకపోవడంతో రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు కాలేదని సంబంధిత అధికారులు చెబుతున్నారు.

గతంలో మరో వ్యక్తి భూమిలోంచి రాకపోకలు సాగించేవారు. ప్రస్తుతం ఆ భూమికి అడ్డంగా కంచె మట్టి వేయడంతో కాలనీకి వెళ్లే వారు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి త్వరితగతిన కాలనీకి వెళ్లేందుకు రహదారి ఏర్పాటు చేసి, కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుకుంటున్నారు.


ఇళ్లకు తాళాలు వేసిన లబ్ధిదారులు


కాలనీకి వెళ్లే దారిలో వేసిన మట్టి ముళ్ళ కంచె


సన్మానిస్తున్న ఆలయ అధ్యక్ష, కారదర్శులు

మార్కెట్ కమిటీ ఛైర్మన్ అప్పలరాజుకు సత్కారం

ప్రజాశక్తి- మాడుగుల:వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా నూతనంగా ఎంపికైన మాడుగుల మోదకొండమ్మ ఆలయ కమిటీ ఛైర్మన్, మాజీ ఎంపీపీ పుప్పాల అప్పలరాజుకు శుక్రవారం శ్రీ దేవి ఆడిటోరియంలో సివిల్ ఆర్టీసీ అండ్ మోటార్ యూనియన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. రానున్న కాలంలో మరెన్నో ఉన్నత పదవులను అధిరోహించాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు ఎస్వీ కొండలరావు, కార్యదర్శి అన్నంవీడి ప్రసాదరావు, సివిల్ ఆర్టీసీ అండ్ మోటార్ అండ్ సభ్యులు పాల్గొన్నారు.

అయ్యన్నపై అసత్య ప్రచారం : టిడిపి


మాట్లాడుతున్న టిడిపి నేత మధు

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:ఇటీవల జరిగిన పండుగల సందర్భంగా చామంతిపురం, గురందొరపాలెం సర్పంచులు అసభ్యకరంగా డాన్సులు చేశారని, ఈ మేరకు కేసులు నమోదు చేయడం వెనుక స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఉన్నారని మాజీ ఎమ్మెల్యే గణేష్ చేసిన ఆరోపణలను టీడీపీ నేతలు ఖండించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ ధనిమిరెడ్డి మధు మాట్లాడుతూ అసభ్యంగా డాన్సులు చేస్తే చూసి కేసులు పెట్టేంత తీరిక స్పీకర్ అయ్యన్నపాత్రుడుకి లేదన్నారు. ఈ వీడియోలను వైసీపీ మద్దతుదారుడు సోషల్ మీడియాలో పోస్టు చేసి, టిడిపి నాయకులు చేశారని తప్పుడు క్యాప్షన్ పెట్టాడని తెలిపారు. దాన్ని చూసిన పోలీసు ఉన్నతాధికారులు అసభ్యంగా డ్యాన్సులు చేసిన వారిని గుర్తించి, వారిపై కేసులు నమోదు చేశారని పేర్కొన్నారు. కేసులు ఎలా పెడతారంటూ గణేష్ ప్రశ్నించడం, ఆయన అవివేకానికి నిదర్శనమని విమర్శించారు. ఈ సమావేశంలో టిడిపి పార్టీ కౌన్సిలర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

జగత్‌రాయ్‌కు ఘన సన్మానం

ప్రజాశక్తి-చింతపల్లి: చింతపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించి నిర్మాణానికి కృషి చేస్తున్న ఆ కళాశాల గ్రంథాలయ అధ్యాపకులు తాంగుల జగత్ రాయ్‌ను పాడేరు సబ్ కలెక్టర్, ఇన్చార్జి ప్రాజెక్ట్ అధికారి సౌర్యమన్ పటేల్ అభినందించారు. డిగ్రీ కళాశాల 17వ వార్షికోత్సవానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన కళాశాల ప్రిన్సిపాల్ ఎం విజయభారతితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఉపాధి పథకం ద్వారా కోటి 50 లక్షలు మంజూరు చేయడం జరిగిందని, త్వరలోనే డిగ్రీ కళాశాల మైదానం చుట్టుపక్కల ప్రహరీ నిర్మించడం జరుగుతుందన్నారు.


సర్వేలో పాల్గొన్న ఫీల్డ్ అసిస్టెంట్, మత్స్యకార నాయకులు

వేట నిషేధ పరిహారానికి సర్వే

ప్రజాశక్తి -నక్కపల్లి:మత్స్యకారులకు వేట నిషేధ కాలానికి సంబంధించి పరిహారం చెల్లించేందుకుగాను ప్రభుత్వ మార్గదర్శకాలు మేరకు మత్స్య శాఖ ఆధ్వర్యంలో మత్స్యకార గ్రామాల్లో సర్వే చేపట్టారు. మండలంలోని మత్స్యకార గ్రామమైన రాజయ్యపేటలో శుక్రవారం సచివాలయ ఫీల్డ్ అసిస్టెంట్ కొమ్మిరెడ్డి త్రినాధ్, నాగమణి, కూటమి నాయకులు, మత్స్యకార నాయకులతో కలిసి సర్వే చేపట్టారు. సముద్ర తీరంలో పర్యటించి సీసీ బోట్లు, ఎంసీ బోట్లు, లైసెన్స్ లను పరిశీలించి నమోదు చేశారు. వేట నిషేధ కాలానికి సంబంధించి పరిహారం చెల్లించేందుకు అర్హులైన మత్స్యకారుల జాబితాను రూపొందిస్తున్నారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు మాట్లాడుతూ వేట నిషేధ కాలానికి సంబంధించి 20 వేల పరిహారం ఈ నెల 26 తేదిన మత్స్యకారుల బ్యాంక్ అకౌంట్‌లలో జమ చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించిందని, అర్హులందరికీ పరిహారం అందే విధంగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు పిక్కి సత్తియ్య, సొసైటీ ప్రెసిడెంట్ పిక్కి కోదండరావు, టిడిపి గ్రామ శాఖ అధ్యక్షులు పిక్కి గంగరాజు, కూటమి నాయకులు వాసుపల్లి శివ, వాసుపల్లి రాము, మైలపల్లి ప్రసాద్, సత్యారావు, చోడిపల్లి రాంబాబు, బొంది గుర్రన్న, పిక్కి చిన్నారి, పిక్కి కిరణ్, గోసల అంజి, పిక్కి కోటి, అప్పలరాజు పాల్గొన్నారు.


సభ్యత్వ కార్డులు పంపిణీ చేస్తున్న రాజేష్

సభ్యత్వ కార్డుల పంపిణీ

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:ఇటీవల సభ్యత్వం తీసుకున్న తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు, నాయకులకు సభ్యత్వ కార్డులను కౌన్సిలర్ చింతకాయల రాజేష్ శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ రాజేష్ మాట్లాడుతూ, నాయకులు, కార్యకర్తలకు సభ్యత్వ కార్డులే అసలైన గుర్తింపు అని, అధికారంతో సంబంధం లేకుండా ఎప్పుడూ ప్రజల కోసమే పనిచేసే పార్టీ తెలుగుదేశం అన్నారు. మున్సిపాలిటీ వార్డు నేతలు, బూత్ కన్వీనర్లు ఇంటింటికీ వెళ్లి సభ్యత్వ కార్డులు పంపిణీ చేయాలని తెలిపారు. అలాగే నర్సీపట్నం రూరల్ మండలాలకు కూడా త్వరలో సభ్యత్వ కార్డులు పంపిణీ చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మున్సిపాలిటీ వార్డు కౌన్సిలర్లు, బూత్ కన్వీనర్లు, నాయకులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరిహారం చెల్లింపు

ప్రజాశక్తి -కోటవురట్ల: కైలాసపట్నం బాణాసంచా ఘటనలో అసువులు బాసిన బాధిత కుటుంబ సభ్యులను అన్ని విధాలుగా ఆదుకుంటామని కూటమి నాయకులు అన్నారు, విశాఖ కేజీహెచ్ లో చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందిన జల్లూరు నాగరాజు కుటుంబ సభ్యులకు స్థానిక తహసీల్దారు తిరుమల బాబు ఆధ్వర్యంలో శుక్రవారం టిడిపి జిల్లా నాయకులు కాశీనాయుడు, మండల టిడిపి అధ్యక్షులు జానకి శ్రీను, జనసేన పార్టీ అధ్యక్షులు సింగంపల్లి శ్రీనివాస్ చేతుల మీదుగా 15 లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బాధిత కుటుంబ సభ్యులను అన్ని విధాలుగా ఆదుకుంటుందని ఆందోళన చెందవద్దని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు, మృతుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. త్వరలో కేంద్రం అందజేసే రెండు లక్షల చెక్కును అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు సూర్యారావు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి -భీమునిపట్నం : అనకాపల్లి జిల్లా ,కోటవురట్ల మండలం, కైలాస పట్నం గ్రామంలో బాణసంచా పేలుడు ఘటనలో మృతి చెందిన భీమిలి మండలం, రేఖవానిపాలెం పంచాయితీ, మహాలక్ష్మీ పురం గ్రామానికి చెందిన ఎం.హేమంత్ కుటుంబాన్ని శుక్ర వారంభీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పరామర్శించారు ప్రభుత్వం ప్రకటించిన రూ.15 లక్షల ఎక్స్ గ్రేషియా చెక్కును బాధిత కుటుంబానికి అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున అన్ని విధాలా అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి గాడు వెంకట ప్పుడు,టిడిపి మండల అధ్యక్షులు డిఎస్ఎన్ రాజు, టిడిపి, జనసేన నాయకులు పాల్గొన్నారు


ఎక్స్‌గ్రేషియా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే గంటా

బిఎస్ఎన్ఎల్ సెల్ టవర్ పనులు పూర్తిచేయాలి

ప్రజాశక్తి - రావికమతం:బిఎస్ఎన్ఎల్ టవర్ నిర్మాణ పనులు త్వరితంగా పూర్తి చేయాలని కవగుంట సర్పంచ్ దాసరి సూర్యకుమారి తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, కవగుంట గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న బిఎస్ఎన్ఎల్ టవర్ పనులు నిలిచిపోయాయన్నారు.గ్రామానికి సిగ్నల్ సమస్య ఎక్కువగా ఉండడంతో అధికారులు, ప్రజలు, గత కొన్నేళ్లగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. నెట్ లేకపోతే గ్రామంలో సర్వే తదితర పనులు ఏవి కూడా ముందుకు సాగని పరిస్థితి నెలకొందన్నారు. ఈ సమస్యను తహసిల్దారు.దృష్టికి తీసుకు వెళ్ళగా భూమిని గుర్తించి బిఎస్ఎన్ఎల్ టవరు పనులను ప్రారంభించారన్నారు. పనులను చేపట్టిన రెండవ రోజున రియల్ ఎస్టేట్ వ్యాపారి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పనులను నిలిపివేయడం జరిగిందన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులకు సహకరించడం పట్ల ఆమె ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చదువులు సాగేదెలా..!

-తండ్రి మృతితో దిక్కుతోచని స్థితిలో పిల్లలు
- సాయం చేసే చేతుల కోసం ఎదురుచూపు
- విషాదం మిగిల్చిన బాణసంచా ప్రమాదం



తండ్రిని కోల్పోయిన లహరి, నగేష్

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి: జిల్లాలోని కోటవురట్ల మండలం కైలాసపట్నంలో ఈ నెల 13న బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన భారీ ప్రమాదం ఇద్దరి పిల్లల చదువులను అర్థాంతరంగా నిలిచిపోయేలా చేసింది. కష్టపడి చదివించి పిల్లల ఉన్నతిని చూడాలనుకొనే తండ్రి మరణంతో భవిష్యత్‌ను తలచుకొని పేద కుటుంబం విలవిల్లాడుతోంది. తమ కష్టమెవరికి చెప్పుకోవాలో తెలీక తల్లడిల్లుతోంది. తమ చదువులెలా సాగుతాయోనని కన్నీటిపర్యంతమవుతోంది. తన తండ్రికన్న కలలను సాకారం చేసే చేతుల కోసం పిల్లలిద్దరూ ఎదురుచూస్తున్నారు. కైలాసపట్నానికి చెందిన సంగరాతి గోవింద్‌కు ఇద్దరు పిల్లలు. అమ్మాయి లహరి రాజమండ్రి ఐఎస్‌టిఎస్ ఉమెన్ ఇంజనీరింగ్ కాలేజీలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్(ఎఐఎంఎల్) బ్రాంచ్ మొదటి ఏడాది బిటెక్ చదువుతోంది. అబ్బాయి ఇంటర్ రెండో సంవత్సరం ఎంపిసిలో 850 మార్కులతో ఉత్తీర్ణుడయ్యాడు. అరెకర భూమిపై వచ్చే ఆదాయంతో ఇద్దరి పిల్లల చదువులకు పెట్టుబడి పెట్టలేక, వ్యవసాయ పనులు రోజూలేక ప్రమాదమని తెలిసినా బాణ సంచా తయారీ కేంద్రంలో గోవింద్ నాలుగేళ్లకు పైగా పనిచేస్తున్నాడు. ప్రతి రోజూ పని దొరకడంతో పాటు కూలి ఐదు వందలు రావడంతో ఇద్దరి పిల్లలను చదివించుకుంటూ, కుటుంబాన్ని నెట్టుకుంటూ వచ్చాడు.

బాణ సంచాతయారీ కూలి డబ్బులతో పిల్లలిద్దరినీ చదివించాడు. ఇపుడా తండ్రి మరణంతో పిల్లల చదువులేకాదు, కుటుంబ పోషణ భారంగా మారింది. బిటెక్ చేయాలనుకున్న నగేష్‌కు, బిటెక్ పూర్తిచేసే వరకు లహరికి ఫీజులు కట్టే తండ్రి లేకపోవడంతో ఆర్థిక స్థోమతలేక చదువులు ఏమిచేయాలో తెలియని పరిస్థితిలో తీవ్ర మనస్థాపం చెందుతున్నారు. గోవింద్ అబ్బాయి నగేష్ చాలా కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఫిట్స్‌కు మందులు వాడ్డంతో తగ్గింది. తన తండ్రి మరణంతో నగేష్ తీవ్రమైన ఒత్తిడికి లోనవడంతో మళ్లీ ఫిట్స్ వచ్చింది. పిల్లలిద్దరినీ చదివించి ప్రభుత్వం దారిచూపాలని లహరి, నగేష్ పెదనాన్న రాజబాబు కోరుతున్నాడు. పిల్లలిద్దరినీ చదివించే స్థోమత తనవద్దాలేదని ఆయన ఆవేదన వ్యక్తంచేశాడు. ఫీజులు కట్టి చదువుకోలేని మమ్మల్ని చదివించడానికి ఎవరైనా చదివిస్తే చదువు కొనసాగించగలమని, లేకపోతే చదవలేమని లహరి, నగేష్ ప్రజాశక్తి వద్ద వాపోయారు. తండ్రిలేని ఆ పేద పిల్లలు తమను చదివించే మనసున్న మనుషుల కోసం దీనంగా చూస్తున్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

స్మార్ట్ మీటర్లను బిగించొద్దు : సిపిఎం

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్: స్మార్టు మీటర్ల బిగింపును ఉప సంహరించుకోవాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అడిగర్ల రాజు డిమాండ్ చేశారు. శుక్రవారం గొలుగొండలో సిపిఎం మండల కమిటీ సమావేశం కామ్రేడ్ సాపిరెడ్డి నారాయణమూర్తి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో మా ఇంటికి స్మార్ట్ మీటర్లు బిగించవద్దు...విద్యుత్ చార్జీలను తగ్గించాలని పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఆదాని స్మార్ట్ మీటర్లను బిగించడంతో రైతులకు, ఎస్సీ, ఎస్టీలకు, కుటీర పరిశ్రమలకు ఇచ్చే రాయితీ ఉండదన్నారు. రీచార్జ్‌బుల్ మీటర్లతో ఫోన్స్, డిస్‌లు మాదిరిగా మీటర్లు రీచార్జ్ చేయాల్సి వస్తోందన్నారు. ఇప్పటికే గత కాలంలో వాడిన కరెంట్‌కి సర్దుబాటు చార్జీల పేరుతో వేల కోట్లు ప్రజల నుండి వసూలు చేస్తున్నారన్నారు. ఒక మీటరుకు రూ.15వేల ఖరీదు వినియోగదారుల నుండి 93 నెలలు వసూలు చేస్తారన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్లను బద్దలు కొట్టండని పిలుపునిచ్చిన టిడిపి నేడు ఈ మీటర్లను బిగించడానికి పూనుకుందని, దీన్ని సిపిఎం తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. ప్రజలు ఈ స్మార్ట్ మీటర్ల బిగించడాన్ని వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శివ, లక్ష్మణ్, జోగిరాజు, భూషణం పాల్గొన్నారు.

మోడల్ ప్రైమరీ స్కూల్‌గా ఎంపిక



ప్రచారం చేస్తున్న టీచర్లు

ప్రజాశక్తి- మాడుగుల: మండలంలో ఎం.కోడూరు గ్రామంలో ఇప్పటివరకు ప్రీప్రైమరీ ఒకటి రెండు తరగతులకు పరిమితమైన ప్రాథమిక పాఠశాలను మోడల్ ప్రైమరీ పాఠశాలగా ఎంపిక చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందనీ హెచ్‌ఎం పి శ్రీనివాసరావు, స్కూల్ కమిటీ చైర్మెన్ వి.కిషోర్ శుక్రవారం తెలిపారు. దీనిలో భాగంగా గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించండి అంటూ ఇంటింటా ప్రచార కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం వేసవి సెలవులు గడిచి పాఠశాలలు తెరిచే సమయానికి ప్రతి ఒక్క విద్యార్థికి బ్యాగులు, పుస్తకాలు అందిస్తున్నారని, ప్రైవేటు పాఠశాలకు దీటుగా విద్యాబోధన అందిస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరిగేలా కృషి చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులను కోరారు. ఈ పాఠశాలలో ఐదుగురు ఉపాధ్యాయులతో పాటు ఆంగ్ల బోధన, డిజిటల్ తరగతులు, ఇంటర్నెట్ సదుపాయం ఉందన్నారు.



అవగాహన కల్పిస్తున్న సర్పంచ్, అంగన్‌వాడీ సిబ్బంది

పౌష్టికాహారంపై అవగాహన

ప్రజాశక్తి-వడ్డాది: బుచ్చయ్యపేట మండలం మంగళాపురంలోని అంగన్వాడీ కేంద్రంలో పోషణ పక్వాడ 1000 డేస్‌లో భాగంగా పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. బెనిఫిషరీ రిజిస్ట్రేషన్ పై తల్లులకు వివరించారు. గర్భిణులు పౌష్టికాహారాన్ని తీసుకోవడంతో తల్లి,బిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కంటే పద్మరేఖ, అంగన్వాడి సూపర్వైజర్ రాజరాజేశ్వరి, అంగన్వాడి కార్యకర్త రాధాలక్ష్మి, ఇంజనీరింగ్ అసిస్టెంట్, స్కూల్ హెచ్‌ఎం, ఎంఎల్‌హెచ్‌పి పాల్గొన్నారు.

మత్స్యకారులకు రూ.40 వేల పరిహారం చెల్లించాలి



వినతిపత్రం అందజేస్తున్న మత్స్యకారులు

ప్రజాశక్తి -నక్కపల్లి: వేట నిషేధ కాలానికి సంబంధించి గత సంవత్సరం, ఈ ఏడాది కలిపి 40 వేల రూపాయలు వేట నిషేధ పరిహారాన్ని అర్హులైన మత్స్యకారులందరికీ చెల్లించాలని సిపిఎం నాయకులు, రాజయ్యపేట పంచాయతీ వార్డు మెంబర్ మైలపల్లి మహేష్ బాబు కోరారు. స్థానిక మత్స్యకారులతో కలిసి రాజయ్యపేట సచివాలయంలో ఫిషరీస్ డిపార్ట్మెంట్ ఫీల్డ్ అసిస్టెంట్ కొమ్మిరెడ్డి త్రినాథ్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. గత ఏడాది మత్స్యకారులకు వేట నిషేధం పరిహారం చెల్లించకపోవడంతో ఆర్థిక ఇబ్బందులతో సతమతమయ్యారని, పరిహారం కోసం నేటి వరకు ఎదురు చూడడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 20 వేల రూపాయలు పరిహారాన్ని చెల్లిస్తామని ప్రకటించిందని, గత సంవత్సరానికి సంబంధించిన 20 వేల రూపాయలును కలిపి మొత్తం 40 వేల రూపాయలను మత్స్యకారులకు చెల్లించి ఆదుకోవాలని కోరారు. సమస్యను మత్స్యశాఖ ఉన్నతాధికారుల ద్వారా ప్రభుత్వానికి తెలియజేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార నాయకులు పేర్ల నల్ల, పిక్కి నూకరాజు, గోసల కాశీ, పిక్కి కాశీ తదితరులు పాల్గొన్నారు.



స్ప్రేయింగ్ చేయిస్తున్న అధికారులు

అర్లలో దోమల మందు స్ప్రేయింగ్

ప్రజాశక్తి-రోలుగుంట: రోలుగుంట మండలం బుచ్చంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని అర్ల గ్రామంలో మలేరియా అధికారులు దోమల నివారణకు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఇంటింటా దోమల మందు స్ప్రేయింగ్ చేయించారు. ఈ సందర్భంగా మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ బెన్నయ్య మాట్లాడుతూ, సీజనల్ వ్యాదులు రాకుండా ముందస్తు చర్యల్లో భాగంగా మలేరియా, డెంగ్యూ, ఫైలేరియా తదితర వ్యాధుల బారిన ప్రజలు పడకుండా ఈ చర్యలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ రమా కాంతరావు, పీహెచ్‌ఎన్ నారాయణమ్మ, హెచ్‌వి సన్యాసమ్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



మాడుగులలో అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి- మాడుగుల: అగ్ని ప్రమాదాల సంభవించిన ప్పుడు ప్రజలు ఏ విధమైన జాగ్రత్తలు తీసుకుంటే ఆస్తి ప్రాణ నష్టం జరగకుండా ఉంటుందనే విషయంపై శుక్రవారం జాతీయ అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మాడుగుల భారత్ గ్యాస్ స్టాక్ పాయింట్ వద్ద అగ్నిమాపక సిబ్బంది అవగాహన కల్పించారు. గ్యాస్ సిలిండర్ల నుండి గ్యాస్ లీకేజ్ అయ్యి మంటలు వ్యాపిస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణ చర్యలపై అగ్నిమాపక అధికారి వడ్డాది రాజేశ్వరరావు సిబ్బందికి అవగాహన కల్పించారు. అనంతరం కరపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది ఎల్ ఎస్ భోగేశ్వరరావు, పి ఎస్ ఎస్ వర్మ, పివిఆర్ మూర్తి, వి వరహాలరావు పాల్గొన్నారు.

సబ్బవరం : అగ్ని మాపక వారోత్సవాలలో భాగంగా పెట్రోల్ బంకులలో అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలపై శుక్రవారం మండల కేంద్రంలోని స్థానిక బంకులో సిబ్బందికి, వాహనచోదకులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్థానిక అగ్నిమాపక అధికారి జివి.సత్యరాజు పెట్రోల్ బంకులలో అగ్ని ప్రమాదాల జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తెలియజేశారు. కార్యక్రమంలో పలువురు అగ్నిమాపక సిబ్బంది, వాహన చోధకులు, పెట్రోల్ బంకు సిబ్బందిపాల్గొన్నారు.

భీమునిపట్నం : జివిఎంసి నాలుగో వార్డు, కాపులుప్పాడలో ప్రైవేట్ ఫ్యాక్టరీ ఆవరణలో చిట్టివలస అగ్నిమాపకశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం అగ్నిప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణ చర్యలపై మాక్‌డ్రిల్ నిర్వహించి అవగాహన కల్పించారు.కార్యక్రమంలో ఫైర్ ఆఫీసర్ జి శ్రీనివాసరాజు, సిబ్బంది పాల్గొన్నారు.



భీమిలిలో అవగాహన కల్పిస్తున్న సిబ్బంది



మొక్కలతో అపరిశుభ్రంగా ఉన్న డ్రెయినేజీ

అస్తవ్యస్తంగా డ్రెయినేజీలు

ప్రజాశక్తి- మాడుగుల: మాడుగులలోని కాలువల్లో పూడికతీత, జంగిల్ క్లియర్ చేయక పోవడంతో దుర్భరంగా తయారయ్యాయి. స్థానిక 4 వార్డ్ తహసిల్దార్ కార్యాలయం ఎదుటే ఈ విధంగా ఉండడం విశేషం. కురుస్తున్న వర్షాల కారణంగా కాలువల్లో పూడికలు తీయకపోవడం, పిచ్చి మొక్కలు పెరగడంతో దోమలు బెడద అధికమై అనారోగ్యాల బారిన పడతామని స్థానికుల భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి కాలువల్లో పూడిక తీత తీసి పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేయాలని వారు కోతున్నారు.